భీమవరం ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 33.0
కనిష్ఠం : 19.0

రంజాన్ వేళలు
ఇఫ్తార్ : 6:21 (ఆది)
సహరి : 4:47 (సోమ)

మోగిన నగారా





నాలుగో దశలో లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలు

షెడ్యూలు విడుదల చేసిన కేంద్ర ఎన్నికల సంఘం

ఏప్రిల్ 18న నోటిఫికేషన్ మే 13న పోలింగ్



ఉండిలో రేషన్ వాహనంపై సీఎం జగన్ బొమ్మ కనిపించకుండా కాగితం అతికిస్తున్న సిబ్బంది

కోడ్ కూసింది

- నాయకుల విగ్రహాలకు ముసుగులు.. రాజకీయ పార్టీల బ్యానర్లు, ఫ్లెక్సీలు, కటౌట్లు తొలగింపు
- షెడ్యూల్ విడుదలతో అమల్లోకి ఎన్నికల కోడ్

భీమవరం, మార్చి 16 : సార్వత్రిక ఎన్నికల ప్రకటనతో శనివారం మధ్యాహ్నం మూడున్నర గంటల నుంచి కోడ్ అమలులోకి వచ్చినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ సుమిత్‌కుమార్ ప్రకటించడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. జిల్లాలోని అన్ని నియోజవర్గాల ఎన్నికల అధికారులు మధ్యాహ్నానికే భీమవరం కలెక్టరేట్‌కు రప్పించి ఎన్నికల నియమావళి అమలుకు సంబంధించిన ఆదేశాలు జారీచేశారు. నరసాపురం సబ్ కలెక్టర్, భీమవరం, తాడేపల్లిగూడెం ఆర్డీవోలు, ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు చెందిన ఎన్నికల అధికారులు, వారి పరిధిలో పనిచేసే కిందిస్థాయి యంత్రాంగం సమీక్షలో పాల్గొన్నారు. ఎన్నికల నియమావళి పై కలెక్టర్ సుమిత్‌కుమార్ పలు సూచనలు చేశారు. కోడ్ నియమావళిని అమలు చేయాలని సూచనలు ఇవ్వటంతో నియోజకవర్గాల అధికారులకు ఆదేశాలు వెళ్లాయి. దీంతో తొలి దఫాలో రాజకీయ పార్టీలు ఏర్పాటు చేసిన స్వాగతం బ్యాన ర్లు, ఫ్లెక్సీలు, కటౌట్ల తొలగింపు పనులు చేపట్టారు. భీమవరంలో సాయంత్రం నాలుగు గంటలకు ఈ కార్యక్రమం ప్రారంభమైంది. జాతీయ నాయకులు, వివిధ రాజకీయా పార్టీలకు చెందిన నాయకుల విగ్రహాలకు ముసుగులు వేసే కార్యక్ర మం చేపట్టారు. రెవెన్యూ శాఖ, మునిసిపల్ సిబ్బంది ఈ కార్యక్రమాన్ని చేపట్టా రు. నిజానికి కొన్నిచోట్ల శనివారం సాయంత్రం నుంచి ఈ పని ప్రారంభమైంది. కొన్ని ఫ్లెక్సీలను తొలగించారు. ప్రత్యేక వాహనం తీసుకుని తొలగించుకుంటూ సిబ్బంది ముందు కదిలారు. అధికార పార్టీవి ఎక్కువ తొలగించారు. చాలాచోట్ల ప్రత్యేక యాడ్ ఏజెన్సీలు ఏర్పాటు చేసిన పెద్ద పెద్ద ఫ్లెక్సీలు కొన్ని మాత్రమే తొలిగాయి. స్థానికంగా బహుళ అంతస్తుల భవనాలపై వాటిని ఏర్పాటు చేశారు. దీంతో వాటి తొలగింపునకు ప్రత్యేక చర్యలు చేపట్టాల్సి ఉంది. ప్రధానంగా అధికార పార్టీకి చెందిన సిద్ధం పోస్టర్లు ఎత్తు భవనాలపై ఏర్పాటుచేశారు. ఒక్క భీమవరంలోనే ఈ పోస్టర్లు పాతికకుపైనే ఉన్నాయి. వాటిని పూర్తిస్థాయిలో రెండు రోజుల్లో తొలగించే అవకాశం ఉంది.



కలెక్టర్ సుమిత్‌కుమార్

ఎన్నికల నియమావళిని వెంటనే అమలు చేయాలి : కలెక్టర్

భీమవరం, మార్చి 16 : భారత ఎన్నికల సంఘం శనివారం సార్వత్రిక ఎన్నికల షెడ్యూలును విడుదల చేయడంతో ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులోకి వచ్చినట్లు జిల్లా కలెక్టరు సుమిత్‌కుమార్ ప్రకటించారు. 'రాష్ట్రంలో లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికల నోటిఫికేషన్ ఏప్రిల్ 18న విడుదల చేస్తారు. నామినేషన్లకు చివరి తేదీ ఏప్రిల్ 25. పరిశీలన ఏప్రిల్ 26. ఉపసంహరణ గడువు 29. పోలింగ్ తేదీ మే 13. ఓట్ల లెక్కింపు జూన్ 4న నిర్వహించి, ఫలితాలను అదే రోజు వెల్లడిస్తాం. శనివారం నుంచి జిల్లావ్యాప్తంగా ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులోకి వచ్చింది. రాజకీయ పార్టీల ప్రచార బ్యానర్లు, కటౌట్లు, వాల్ పోస్టర్లు, ఫొటోల తొలగింపు పనులన్నింటిని నిర్ణీత గడువులోగా సంబంధిత అధికారులు పూర్తిచేయాలి. గడువు తర్వాత ఫిర్యాదులు వస్తే ఆయా అధికారులపై చర్యలు తప్పవు' అని కలెక్టరు హెచ్చరించారు.

(భీమవరం-ఆంధ్రజ్యోతి)

లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలు మొదటి విడతలో ఉంటాయని భావించిన రాజకీయ పార్టీలు, అభ్యర్థులకు కేంద్ర ఎన్నికల సంఘం షాక్ ఇచ్చిందనే చెప్పాలి. శనివారం విడుదల చేసిన షెడ్యూలులో ఏపీ ఎన్నికలు నాలుగో దశలో నిర్వహిస్తామని ప్రకటించింది. అంటే ఈ రోజు నుంచి పోలింగ్‌కు 57 రోజుల వ్యవధి వుంది. అప్పటి వరకు ప్రచారం కొనసాగించాలంటే ఖర్చు మామూలుగా ఉండదని భావిస్తున్నారు. ఎన్నికల షెడ్యూల్ ఖరారైంది. ప్రధాన పార్టీలు ఎమ్మెల్యే అభ్యర్థులను ప్రకటించాయి. ఇప్పటికే జిల్లాలో ప్రచారం ప్రారంభించారు. ప్రతీసారి తొలి విడతలోనే ఎన్నికలు నిర్వహించేవారు. ఈసారి నాలుగో విడతలో నిర్వహించేలా ఎన్నికల సంఘం షెడ్యూల్ ప్రకటించింది. అంటే మే 13న ఎన్నికలు నిర్వహిస్తారు. అదే ఇప్పుడు అభ్యర్థులను హడలెత్తిస్తున్నాయి. రోజులు పెరిగిన కొద్దీ వ్యయం అధికం కానుంది. కార్యకర్తలను పోషించాల్సి ఉంటుంది. అభ్యర్థులు పాదయాత్రలు నిర్వహిస్తున్నారు. మధ్యాహ్నం భోజనాలు ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటికే కొన్ని నియోజకవర్గాలు తాయిలాలు పంపిణీ చేశారు. మహిళలకు చీరలు పంపిణీ చేసి ఆకట్టుకునే ప్రయత్నం చేశారు. ఎన్నికల వ్యవధి తక్కువగా ఉంటే అంతగా వెచ్చించాల్సిన అవసరం లేదు. రెండు నెలలపాటు ప్రచారం నిర్వహించాలంటే కోట్ల రూపాయల వ్యయం అవుతుందంటూ అభ్యర్థులు గుబులు చెందుతున్నారు. ఏప్రిల్‌లోనే ఎన్నికలు ముగుస్తాయంటూ అభ్యర్థులు ప్రణాళికలు చేసుకున్నారు. సొమ్ములు పోగేసుకుంటున్నారు. ప్రచారంలో పాల్గొనేందుకు, సమావేశాలు ఏర్పాటు చేసేందుకు లక్షలు ఖర్చు అవుతున్నాయి. సాయంత్రమైతే క్వార్టర్ కూడా ఇవ్వాల్సి వస్తోంది. ఆచంటలో అధికార పార్టీ నేత చీరలు పంపిణీ చేశారు. తెలుగుదేశం అభ్యర్థి పితాని సత్యనారాయణ పాదయాత్ర చేస్తున్నారు. రాత్రి పాదయాత్ర ముగిసిన తర్వాత అదే గ్రామంలో బస చేస్తున్నారు. భోజనాలు ఏర్పాటు చేస్తున్నారు. పాలకొల్లులో నిమ్మల పాదయాత్ర నిర్వహిస్తూ మధ్యాహ్నం వందలాది మందికి భోజనాలు కల్పిస్తున్నారు. ఉండిలోనూ రాజకీయం వేడెక్కింది. ఆర్థికంగా బలమైన అభ్యర్థులు పోటీలో ఉన్నారు. అక్కడ ఎన్నికల వ్యయానికి అంతేలేకుండా పోతోంది. మరో రెండు నెలలపాటు కార్యకర్తలను పోషించాలంటే కోట్లు తగల బెట్టాలి. ఇందుకు బడ్జెట్ పెంచాలి. ఇప్పటికే జిల్లాలోని కొన్ని నియోజకవర్గాల్లో ఒక్కో అభ్యర్థికి కనిష్ఠంగా రూ.20 కోట్లు, గరిష్ఠంగా రూ.50 కోట్లు ఖర్చవుతుందని రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. ఇక రెండు నెలలపాటు ఎన్నికల ప్రచారం నిర్వహించేందుకు ఒక్కో అభ్యర్థికి ఎలా లేదన్నా రూ.3 కోట్ల నుంచి రూ.5 కోట్లు అదనపు భారం తప్పదు.

ఇన్ని రోజులా..?

- సుదీర్ఘ సమయంతో అభ్యర్థులకు ముచ్చెమటలు
- తారస్థాయికి చేరనున్న ప్రచార ఖర్చులు
- వైసీపీ అభ్యర్థుల ప్రకటన.. అమీతుమీకి కూటమి సై

జిల్లాలో ఎన్నికలు జరిగేదిలా..

- లోక్‌సభ నియోజకవర్గం : నరసాపురం
- అసెంబ్లీ నియోజకవర్గాలు : భీమవరం, నరసాపురం, పాలకొల్లు, ఆచంట, తణుకు, తాడేపల్లిగూడెం, ఉండి

ఎన్నికల నోటిఫికేషన్ : ఏప్రిల్ 18 • నామినేషన్ల గడువు : 25
నామినేషన్ల పరిశీలన : 26 • ఉపసంహరణ గడువు : 29
పోలింగ్ తేదీ : మే 13.. • ఓట్ల లెక్కింపు : జూన్ 4

ప్రధాన ప్రత్యర్థులు రెడీ..

జిల్లాలో ప్రధాన పార్టీ అభ్యర్థులు ఖరారయ్యారు. బరిలో గెలుపు ఓటములను తేల్చుకోనున్నారు. తెలుగుదేశం - జనసేన - బీజేపీ కూటమి, వైసీపీల నుంచి నర్సాపురం పార్లమెంట్ పరిధిలో పోటీ చేసే అసెంబ్లీ అభ్యర్థులెవరో తేలిపోయింది. ఇప్పటికే పాలకొల్లు, ఆచంట, తణుకు, ఉండి నియోజకవర్గాల్లో కూటమి తరపున టీడీపీ అభ్యర్థులు రంగంలో ఉన్నారు. భీమవరం, తాడేపల్లిగూడెం, నర్సాపురం నియోజకవర్గాల నుంచి జనసేన అభ్యర్థులు బరిలో నిలిచారు. ఇక వైసీపీ నుంచి ఏడు నియోజకవర్గాల అభ్యర్థులను శనివారం ప్రకటించింది. తాడేపల్లిగూడెం మాజీ ఎమ్మెల్యే ఈలి నాని రెండు రోజుల క్రితం సీఎం జగన్ సమక్షంలో వైసీపీలో చేరారు. మంత్రి కొట్టు స్థానంలో ఈయన కు అవకాశం ఉంటుందని పార్టీ నాయకులు భావించారు. కాని, ఒక్కరోజు వ్యవధిలోనే మంత్రికే టిక్కెట్ ప్రకటించారు. దీంతో నాని వర్గం ఢీలా పడింది. తణుకు, ఆచంట, నరసాపురం, భీమవరంల నుంచి సిట్టింగ్‌లనే ఎంపిక చేశారు. పాలకొల్లులో ఈ సారి కొత్తగా గుడాల శ్రీహరిగోపాల రావుకు అవకాశం దక్కింది. ఉండి నుంచి నియోజకవర్గ కన్వీనర్ పీవీఎల్ నరసింహరాజు రెండోసారి పోటీ పడుతున్నారు. ఏడు నియోజకవర్గాల్లోనూ అభ్యర్థులపై పూర్తి స్పష్టత రావడం.. ఎన్నికలకు సుదీర్ఘ సమయం ఉండడంతో ఇక ప్రచారం హోరెత్తనుంది. రాష్ట్రానికి చెందిన ముఖ్యనేతలు జిల్లాను చుట్టేయనున్నారు.

ఎవరు ఎవరితో..

	కూటమి అభ్యర్థి	వైసీపీ అభ్యర్థి
తాడేపల్లిగూడెం	బొల్లిశెట్టి శ్రీనివాస్ (జనసేన)	కొట్టు సత్యనారాయణ
తణుకు	ఆరిమిల్లి రాధాకృష్ణ (టీడీపీ)	కారుమూరి నాగేశ్వరరావు
ఆచంట	పితాని సత్యనారాయణ (టీడీపీ)	చెరుకువాడ శ్రీరంగనాథరాజు
నరసాపురం	బొమ్మిడి నాయకర్ (జనసేన)	ముదునూరి ప్రసాదరాజు
పాలకొల్లు	నిమ్మల రామానాయుడు (టీడీపీ)	గుడాల శ్రీహరిగోపాలరావు
భీమవరం	పులపర్తి రామాంజనేయులు (జనసేన)	గ్రంధి శ్రీనివాస్
ఉండి	మంతెన రామరాజు (టీటీడీ)	పీవీఎల్ నరసింహరాజు



స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తా

- ఉండి మాజీ ఎమ్మెల్యే శివ

కాళ్ల, మార్చి 16 : ప్రజలకు సేవ చేసేందుకు ఉండి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేయనున్నట్లు మాజీ ఎమ్మెల్యే వేటుకూరి శివరామరాజు తెలిపారు. భీమవరం లోని శివ స్వచ్ఛంద సేవా సంస్థ కార్యాలయం లో శనివారం విలేకరుల సమావేశం లో మాట్లాడారు. రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన తనకు టీడీపీ అధిష్టానం మాట కూడా చెప్పకుండా వేరే వారికి సీటు కేటాయించడం తీవ్ర మనస్థాపానికి గురి చేసిందన్నారు. పార్టీల రంగులు మార్చి చేసే అవకాశ వాద రాజకీయాలు తనకు చేతకాదన్నారు. తనకు జరిగిన అన్యాయానికి ప్రజల నుంచి మద్దతు వస్తుండటంతో ప్రజాక్షేత్రంలో పోటీ చేయాలని నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. రైతాంగం పట్ల, ఆక్వా సమస్యలపై అవగాహన వున్న నాయకుడిగా తనను ప్రజలు కోరుకుంటున్నారన్నారు. సమావేశంలో పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.



నేనూ పోటీలో ఉంటా : కొత్తపల్లి

నరసాపురం, మార్చి 16 : వచ్చే ఎన్నికల్లో కచ్చితంగా పోటీలో ఉంటానని మాజీ మంత్రి కొత్తపల్లి సుబ్బారాయుడు మరోసారి స్పష్టం చేశారు. శనివారం టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఆధ్వర్యంలో చిలకలూరిపేట నిర్వహించే భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలంటూ అభిమానులతో భారీ ర్యాలీ చేశారు. అనంతరం విలేకర్లతో మాట్లాడుతూ నరసాపురం అసెంబ్లీ టిక్కెట్‌ను పార్టీ అధినేత పవన్ అధికారికంగా ప్రకటించిన విషయం తన దృష్టికి రాలేదని, అప్పటి వరకు తాను రేస్‌లో ఉంటానన్నారు. మాజీ ఎమ్మెల్యే జానకిరామ్, దొండపాటి స్వామి, కొత్తపల్లి నాని, గుగ్గిలపు మురళి, వైఎస్ బాబులు, వన్నెంరెడ్డి శ్రీను, మల్లిపూడి చిన్న, వాసు తదితరులు పాల్గొన్నారు.



వైసీపీ నుంచి బీజేపీలోకి..

ఇరగవరం, మార్చి 16 : తణుకు పట్టణానికి చెందిన పలువురు బీజేపీలో చేరారు. రెరా మాజీ డైరెక్టర్ ముళ్ళపూడి హరిశ్చంద్రప్రసాద్ (హరిబాబు), మునిసిపల్ మాజీ ఛైర్మన్ ముళ్ళపూడి రేణుక, వైసీపీ తణుకు మండల మాజీ అధ్యక్షుడు పోలేపల్లి వెంకటప్రసాద్, తణుకు పట్టణ వైస్ ప్రెసిడెంట్ సుద్దాల పాండు, సీనియర్ నాయకుడు పైబోయిన సత్యనారాయణ తదితరులు శనివారం విజయవాడ బీజేపీ కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి సమక్షంలో బీజేపీలో చేరారు.

పోలవరం వైసీపీ అభ్యర్థి కులంపై విచారణ

బుట్టాయగూడెం, మార్చి 16 : పోలవరం ఎమ్మెల్యే తెల్లం బాలరాజు సతీమణి, వైసీపీ అభ్యర్థి తెల్లం రాజ్యలక్ష్మి కులంపై శనివారం విచారణ జరిగింది. రాజ్యలక్ష్మి ఎస్టీ కాదని గిరిజన నాయకుడు మడకం వెంకటేశ్వరావు ఏలూరు కలెక్టరేట్ స్పందనలో ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ చేయాలని కలెక్టర్ ప్రసన్న వెంకటేశ్ బుట్టాయగూడెం తహసీల్దార్‌ను ఆదేశించారు. దీనిపై తహశీల్దార్ వెంకటేశ్వర్లు శనివారం వెంకటేశ్వరావు నుంచి స్టేట్‌మెంట్ రికార్డు చేశారు. క్షేత్రస్థాయిలో పీసా గ్రామసభలు ఏర్పాటుచేసి విచారణ జరిపి వాస్తవాలను బయటకుతీసి గిరిజనులకు న్యాయం చేయాలని తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆదివాసీ సేన ధర్నా చేసి స్టేట్‌మెంట్ కాపీలను తహసీల్దార్‌కు అందజేశారు. రాజ్యలక్ష్మి మాత్రం తాను ఎస్టీ కోయ కులానికి చెందుతానని, తనపై చేస్తున్న ఆరోపణలన్నీ అవాస్తవాలేనన్నారు. ఏ విచారణకైనా సిద్ధంగా ఉన్నట్టు తెలిపారు.



వలంటీర్లకు గిఫ్ట్ ప్యాక్‌లు

ద్వారకా తిరుమల, మార్చి 16 : మరో కొద్దిసేపట్లో ఎన్నికల షెడ్యూల్ వెలువడుతుందనగా వైసీపీ నేతలు ఎం.నాగులపల్లిలో ప్రలోభాల పర్వానికి తెరలేపారు. స్థానిక సచివాలయం వద్ద వలంటీర్లకు బహుమతులను పంపిణీ చేయడమే కాకుండా వారితో తన పార్టీకి అనుకూలంగా నినాదాలు చేయించారు. ప్రతీ వలంటీరు తన పరిధిలో 90 శాతం మేర వైసీపీకి ఓట్లు పడేలా కృషి చేయాలని సూచించారు.



లోక్ అదాలత్‌లో కేసులు పరిష్కరిస్తున్న చైర్మన్ సత్యాదేవి

లోక్ అదాలత్‌లో 227 కేసుల పరిష్కారం

భీమవరం క్రైం, మార్చి 16 : భీమవరం కోర్టులో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో 227 కేసులు పరిష్కరించినట్లు భీమవరం మండల న్యాయ సేవాధికార సంస్థ ఛైర్మన్, 3వ అదనపు జిల్లా జడ్జి సత్యాదేవి తెలిపారు. విడాకుల కోసం కోర్టును ఆశ్రయించిన రెండు కేసుల్లోని భార్యాభర్తలకు న్యాయమూర్తులు, న్యాయవాదులు కౌన్సెలింగ్ ఇవ్వడంతో కలిసి జీవించడానికి ఒప్పుకుని, విడాకుల కేసులను వెనక్కి తీసుకున్నారు. అదాలత్‌లో సివిల్ కేసులు 44, భీమవరం టౌన్, రూరల్, వీరవాసరం, ఉండి, పాలకోడేరు, కాళ్ళ, ఆకివీడు పోలీస్ స్టేషన్‌లకు సంబంధించిన క్రిమినల్ కేసులు 109, ఎక్సైజ్ కేసులు 20, మనోవర్తి కేసులు 10, చెక్ బౌన్స్ కేసులు 25, బ్యాంక్ రికవరీ కేసులు 9, బీఎస్ఎన్ఎల్ కేసులు 10 మొత్తం 227 కేసులను ఉభయ పార్టీల కోరిక మేరకు రాజీ చేసినట్లు 3వ అదనపు జిల్లా న్యాయమూర్తి సత్యాదేవి తెలిపారు. పలు కేసుల్లో మూడు కోట్ల 35 లక్షల 7 వేల ఐదు వందల ఎనభై రూపాయల అవార్డులను జారీ చేశారు. బెంచ్ అధికారులుగా న్యాయాధికారులు సీనియర్ సివిల్ జడ్జి బి.అప్పలస్వామి, 1వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి ఎ.సురేష్‌బాబు, 2వ అదనపు జ్యూడిషియల్ మేజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాస్ డి.ధనరాజు సభ్యులుగా పి.మాలతిలత, ఎం.శ్రీనివాసరావు, కె.నాగరాజు, వి.కరుణాకరరావు, బెంచ్ సభ్యులుగా వ్యవహరించారు. పోలీస్ అధికారులు, స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్రాంచ్ అధికారులు, సీనియర్ జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

రేపటి నుంచి టెన్త్ పరీక్షలు

- 27,426 మంది విద్యార్థులు.. 127 పరీక్ష కేంద్రాలు
- ఏర్పాట్లు పూర్తి చేశాం : డీఈవో

భీమవరం టౌన్, మార్చి 16 : పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని డీఈవో ఆర్.వెంకటరమణ తెలిపారు. శనివారం జిల్లా కలెక్టరేట్‌లో టెన్త్ పరీక్షలపై విలేకరులతో మాట్లాడారు. 'ఈ నెల 18 నుంచి 30వ తేదీ మధ్య ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12-45 వరకు పరీక్షలు జరుగుతాయి. వీటికి రెగ్యులర్ విద్యార్థులు 21,341 మంది, గత పరీక్షల్లో తప్పిన వారు 6,085 మంది మొత్తం 27,426 హాజరుకానున్నారు. పరీక్ష పత్రాలను జిల్లాలో 22 స్టోరేజీ పాయింట్స్‌లో భద్రపరిచాం. చీఫ్ సూపరింటెం డెంట్లు 127, డిపార్ట్‌మెంటల్ అధికారులు 127, అడిషనల్ డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్లు 15, కస్టోడియన్లు 44, ఫ్లయింగ్ స్క్వాడ్ ఆరు, సీ కేటగిరి రూటు ఆఫీసర్లు 24, ఎనిమిది మంది రూటు ఆఫీసర్లు, మరో ఎనిమిది మంది సహాయ రూటు ఆఫీసర్లు, 24 సిట్టింగ్ స్క్వాడ్, 1390 మంది ఇన్విజిలేటర్లను నియమించాం. పరీక్షల సిబ్బంది విధిగా గుర్తింపు కార్డు ధరించి విధులకు హాజరుకావాలి. విద్యార్థులను పరీక్షకు ఉదయం 8.45 నుంచి 9.30 వరకు మాత్రమే అనుమతి ఇస్తాం. పరీక్ష కేంద్రాలకు సెల్‌ఫోన్, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలు తీసుకురాకూడదు. ఎలాంటి సమాచారం తెలుసుకోవాలన్నా కలెక్టరేట్‌లోని కంట్రోల్ రూమ్ నెంబరు 93467 26024కు ఫోన్ చేయవచ్చు. ప్రతి క్వశ్చన్ పేపర్‌కు క్యూ ఆర్ కోడ్ ఉంటుంది. పేపరు బయటకు వస్తే దీని ఆధారంగా గుర్తించి విద్యార్థితోపాటు అధికారులను సస్పెండ్ చేస్తాం. పరీక్ష కేంద్రంలోకి సెల్‌ఫోన్‌లు నిషేధం. అధికారులు సహా ఎవరూ ఫోన్లు తీసుకువెళ్ళకూడదు. జిల్లాలో ఆరు సమస్యాత్మక కేంద్రాలైన ఆరుగొలను, అలంపురం, పెనుమంట్ర, ఎంపి పాలెం, శృంగవృక్షం, సీతారామపురంలలో సీసీ కెమేరాలను ఏర్పాటుచేశాం. జంబ్లింగ్ విధానంలో విద్యార్థులకు పరీక్ష కేంద్రాలను కేటాయించాం' అని డీఈవో తెలిపారు.

ఓపెన్ స్కూల్ ఎస్ఎస్‌సీ, ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు ఈ నెల 18 నుంచి మార్చి 26 వరకు మధ్యాహ్నం 2.45 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు నిర్వహించనున్నట్లు విద్యా శాఖ ఇన్‌చార్జ్ సహాయ కమిషనర్ ఎన్.సత్యనారాయణ తెలిపారు. ఎస్ఎస్‌సిలో 997 మంది, ఇంటర్మీడియట్ 1890 మంది పరీక్షలు రాయనున్నారు. విద్యా శాఖ సూపరిండెంట్ ఎన్.తిరుపతిరాజు, విద్యా శాఖ సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఈవో వెంకటరమణ

నేడు గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్ష

7 పరీక్ష కేంద్రాలు.. 4,209 మంది అభ్యర్థులు

భీమవరం ఎడ్యుకేషన్, మార్చి 16:పశ్చిమ గోదావరి జిల్లాలోని ఏడు కేంద్రాల్లో గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్ష ఆదివారం నిర్వహించనున్నారు. అన్ని పరీక్ష కేంద్రాలలో సీసీ టీవీ కెమెరాలు ఏర్పాట్లు చేశారు. 4,209 మంది అభ్యర్థులు హాజరు కానున్నారు. అభ్యర్థులు పరీక్ష కేంద్రానికి గంట ముందే చేరుకోవాలి. పరీక్షలు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం రెండు నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు జరుగుతాయి. సమయం దాటిన తర్వాత పరీక్షకు అనుమతించరు. సెల్‌ఫోన్లు, ఎలక్ట్రానిక్ గాడ్జెట్స్, పుస్తకాలను అనుమతించరు. అభ్యర్థులు పరీక్షా కేంద్రానికి హాల్ టికెట్, ప్రభుత్వం జారీ చేసిన ఏదైనా గుర్తింపు కార్డు (ఆధార్, డ్రైవింగ్ లైసెన్స్, ఓటరు ఐడీ కార్డు మొదలైనవి) తీసుకువెళ్లాలి.

ఏలూరు జిల్లాలో..

ఏలూరు జిల్లాలో 4,372 మంది అభ్యర్థులకు గాను ఐదు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ ప్రసన్న వెంకటేశ్ తెలిపారు. ప్రతి పరీక్షా కేంద్రం వద్ద పోలీస్ బందోబస్తు, వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సీసీ కెమెరాల పర్యవేక్షణలో పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తయ్యాయన్నారు. గ్రూప్-1 అభ్యర్థుల సౌకర్యార్థం హెల్ప్‌డెస్క్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అభ్యర్థులు ఏ సహాయం కోసమైనా కంట్రోల్ రూమ్ నెంబర్ 94910 41436, సెక్షన్ అధికారి 90145 50879, 93913 34127 నెంబర్‌లలో సంప్రదించవచ్చన్నారు.



ఎన్నికల వేళ.. జగనన్న లే-అవుట్‌లో హడావుడి

- 7లో..

బండారుపై వ్యక్తిగత విమర్శలు తగవు


విలేకరులతో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

నరసాపురం టౌన్, మార్చి 16: మాజీ ఎమ్మెల్యే బండారు మాధవ నాయుడుపై వ్యక్తిగత విమర్శలు చేయడం మానుకోవాలని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి చిటికెల రామోహ్మన్‌రావు, నడిపూడి కృష్ణ, బస్వాని ఏడుకొండలు, కొట్టు పండు హితవు పలికారు. శనివారం బండారు కార్యాలయంలో వారు విలేకర్లతో మాట్లాడుతూ పార్టీలో ఉంటూ పార్టీ నేతలపైనే విమర్శలు చేయడం బాధాకరమన్నారు. అధికార వైసీపీపై ఎవరెన్ని పోరాటాలు, ఎమ్మెల్యే ముదునూరికి పార్టీలో ఉంటూ ఎవరు సహకరిస్తున్నారో..... పార్టీ అధినేతలకు, నియోజకవర్గ ప్రజలందరికీ తెలుసునన్నారు. ప్రజా ఉద్యమాలు చేసినందునే మాజీ ఎమ్మెల్యే బండారుపై కేసులు పెట్టారన్న విషయం అందరికీ తెలుసునన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు హేమలత, ఆంద్రాజు రామన్న, ఆడిదెల దానియేలు, రేవు ప్రభుదాసు, ఏడుకొండలు, తంగేళ్ళ నాగేశ్వరరావు, ఎం రాము, చాగంటి నాగేంద్ర, రెడ్డిం శ్రీను పాల్గొన్నారు.

కాంగ్రెసు ఎస్సీ సెల్ జనరల్ సెక్రటరీగా రత్నరాజు



భీమవరం అర్బన్, మార్చి 16: విజయవాడ ఆంధ్రరత్న భవన్‌లో జరిగిన ఎస్సీ సెల్ రాష్ట్ర కమిటీ సమావేశంలో భీమవరానికి చెందిన కాంగ్రెసు పార్టీ నాయకులు పుచ్చకాయల రత్నరాజుకు రాష్ట్ర ఎస్సీ సెల్ జనరల్ సెక్రటరీగా నియమిస్తు రాష్ట్ర ఎస్సీ సెల్ చైర్మన్ సాకే శంకర్ నియామక ఉత్తర్వుల పత్రాలను అందించారు. ఈ సందర్భంగా రత్నరాజుకు భీమవరం కాంగ్రెసు పార్టీ నాయకులు శుభాకాంక్షలు తెలిపారు.

బీసీల అభ్యున్నతికి పాటుపడేవారికే మద్దతు


మాట్లాడుతున్న బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు

ఇరగవరం, మార్చి 16 : రాజకీయ నాయకులు బీసీలను కేవలం ఓటు బ్యాంకుగా మాత్రమే వినియోగించుకుంటున్నారని రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కేసన శంకరరావు ఆరోపించారు. తణుకు పట్టణ బీసీ నాయకులతో కలసి శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ బీసీ ప్రజా ప్రతినిధులు తమను చట్టసభల్లోకి పంపించండి సమస్యలు తీరుస్తామని అనేక మంది వస్తున్నారని, అయితే అధికారం చేపట్టాక ఏ పార్టీ నుంచి గెలిచారో ఆ పార్టీకే కొమ్ముకాస్తూ బీసీలకు అన్యాయం చేస్తున్నారన్నారు. రానున్న ఎన్నికల్లో పార్టీతో సంబంధం లేకుండా బీసీ అభ్యున్నతి కోసం పాటుపడే బీసీ అభ్యర్థులను గెలిపించుకునేలా కృషి చేస్తామన్నారు. రాష్ట్ర యువజన అధ్యక్షుడు కుమ్మర క్రాంతికుమార్, ఉపాధ్యక్షుడు గుర్రం ద్వారకాశ్రీను, నియోజకవర్గ అధ్యక్షుడు మట్టా వెంకట్, రాష్ట్ర యాదవ సంఘం ఉపాధ్యక్షుడు కడియాల సూర్యనారాయణ, జిల్లా ఉపాధ్యక్షుడు తమరాపు సత్యనారాయణ పాల్గొన్నారు.

పోలింగ్ సిబ్బందికి కొనసాగిన శిక్షణ

ఆచంట, మార్చి 16: ఆచంటలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పోలింగ్ సిబ్బందికి జరుగుతున్న శిక్షణ కార్యక్రమం రెండవ రోజు అయిన శనివారం కూడా నిర్వహించారు. పోలింగ్ సిబ్బందికి ఈవీఎంలపై అవగాహన కల్పిస్తున్నారు. నియోజకవర్గ ఎన్నికల అధికారి స్వామినాయుడు ఆధ్వర్యంలో జరిగిన ఈ శిక్షన తరగతుల్లో మొత్తం 451 మంది పోలింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

ఉగాది వేడుకలు సంప్రదాయానికి ప్రతీకలు

భీమవరం టౌన్, మార్చి 16: శ్రీవిజ్ఞానవేదిక అధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉగాది వేడుకల బ్రోచర్‌ను జిల్లా కలెక్టర్ సుమిత్ గాంధీ ఆవిష్కరించారు. దేశంలో అన్ని ప్రాంతాల్లో అయా సంప్రదాయాలకు అనుగుణంగా నిర్వహించుకునే ఉగాది పండుగను ఇతర దేశాల్లో కూడా జరుపుకుంటున్నారని అన్నారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ వచ్చేనెల 9వ తేదీ వరకు ఉగాది వేడుకలను నిర్వహిస్తున్నామని, 9న భీమేశ్వర స్వామి దేవస్థానంలో ఉగాది పురస్కారాలు అందిస్తామని తెలిపారు.

ముమ్మరంగా ఉపాధి పనులు



మొగల్తూరు, మార్చి 16: వరి చేలకు పంట నీరు అందించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. దాళ్వా చేలకు నీరందించడంలో పంట బోదెలు పూడుకుపోవడం, తూడు, గుర్రపు డెక్క ఉండటంతో సాగునీరు అందక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. శనివారం మంలంలోని కెపిపాలెం, శేరేపాలెం, మొగల్తూరు పంచాయతీ పరిధిలో పలు పంటబోదెల్లో పేరుకుపోయిన గుర్రపు డెక్క, తూడు ఉపాధి కూలీలతో తొలగించే పనులు చేపట్టినట్టు టెక్నికల్ అసిస్టెంట్ వెంకటేశ్వరరావు తెలిపారు.

30న రన్ ఫర్ జీసస్

నరసాపురం టౌన్, మార్చి 16: ఈస్టర్ పర్వదినాన్ని పురస్కరించుకుని ఈనెల 30న పట్టణంలోని రన్‌ఫర్ జీసస్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కోఆర్డినేటర్ సంజయ్‌కిషన్ చెప్పారు. ఈ ర్యాలీ థామస్ వంతెన నుంచి పురవీధుల్లో సాగుతుందున్నారు. క్రైస్తవులందరూ ర్యాలీలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.

వాండ్రంలో శ్మశాన భూమి సర్వే

ఉండి, మార్చి 16: వాండ్రం గ్రామంలో దళితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు రెవెన్యూ అధికారులు కాలువగట్టుపై వున్న శ్మశానం భూమిని సర్వే చేశారు. భూమి సరిహద్దులను రెవెన్యూ రికార్డులతో అధికారులతో సర్వేచేసి వాటిని నిర్ధారణ చేసినట్లు తెలిపారు.


ఆకివీడులో ఫ్లెక్సీల తొలగింపు..

ఫ్లెక్సీల తొలగింపు.. విగ్రహాలకు ముసుగు

ఆకివీడు, మార్చి 16: ఎన్నికల కోడ్ శనివారం మధ్యాహ్నం నుంచి అమల్లోకి వచ్చిందని కమిషనర్ జి.కృష్ణమోహన్ తెలిపారు. కోడ్ అమలులోకి వస్తే ఫ్లెక్సీలు తొలగించాల్సి ఉంటుందని, అందుచేత ముందుగానే తొలగించుకోవాలని వివిధ రాజకీయ పార్టీల నేతలకు చెప్పడం జరిగిందన్నారు. పట్టణ పరిధిలో ఉన్న ఫ్లెక్సీలు తొలగిస్తున్నా మని, ఆదివారం సాయంత్రానికి పూర్తిగా తొలగించడం జరుగుతుందన్నారు.

ఆచంట: ఎన్నికల అధికారుల ఆదేశాలు మేరకు మండలంలోని అన్నిగ్రామాల్లో ఉన్న ఆయా రాజకీయ నాయకుల ఫ్లెక్సీలు తొలగించే కార్యక్రమం చేపట్టారు. అలాగే నాయకులు విగ్రహాలు కూడా ముసుగుల వేసే కార్యక్రమం చేపట్టారు.

గణపవరం: గణపవరం ఎంపీడీవో ప్రభాకరరావు, ఈవోపీఆర్‌డీ సూర్యనారాయణ నేతృత్వంలో సరిపల్లె, గణపవరం గ్రామాల్లో ఫ్లెక్సీల తొలగింపు నిర్వహించారు. గ్రామ కార్యదర్శి రామాంజనేయులు, వీఆర్వోలు వేణుగోపాల్, ఆకుల బాబురాజేంద్రప్రసాద్, జి.రామారావు, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

ఉండి: మండలంలోని 19 గ్రామాలలో బియ్యం పంపిణీ చేసే వాహనాలపై వున్న ముఖ్యమంత్రి జగన్ బొమ్మలపై పేపరు కాగితాలతో కనిపించకుండా మూసివేశారు. ఉండి సెంటర్‌లో వున్న ఆయా ఫ్లెక్సీలను తొలగించారు.

వీరవాసరం: వీరవాసరంతో పాటు గ్రామాలలో ప్రచారం కోసం పెట్టిన రాజకీయ పార్టీల ఫ్లెక్సీలను తొలగించే చర్యలు చేపట్టారు. ప్రత్యేకంగా వాహనాన్ని ఏర్పాటుచేసి వీరవాసరం గొంతేరు డ్రెయిన్ నుంచి పశ్చిమకాలువ జాతీయ రహదారి ప్రధాన రహదారుల వెంబడి ఉన్న ఫ్లెక్సీలను, బోర్డులను తొలగించి వాహనంలో వేశారు.



వీరవాసరంలో ఫ్లెక్సీల తొలగింపు..ఆచంటలో విగ్రహానికి ముసుగు





నరసాపురంలో ప్రచారం చేస్తున్న బొమ్మిడి నాయకర్.. వడలిలో మాజీ మంత్రి పితాని పర్యటన.. తాడేపల్లిగూడెంలో ఐక్యత చాటుతున్న మూడు పార్టీల నాయకులు.. పాలకొల్లులో బాణసంచా కాలుస్తున్న టీడీపీ నాయకులు

వైసీపీ ప్రభుత్వానికి చరమగీతం పాడాలి

పెనుగొండ, మార్చి 16: సంక్షేమం మాటున ఆంధ్ర రాష్ట్రాన్ని లూటీ చేస్తున్న వైసీపీ ప్రభుత్వానికి చరమగీతం పాడాలని మాజీ మంత్రి పితాని సత్యనారాయణ అన్నారు. వడలి, కొఠాలపర్రు గ్రామాల్లో ప్రజల వద్దకు పితాని పాదయాత్ర కార్యక్రమం నిర్వహించారు. వైసీపీ నుంచి అధిక సంఖ్యలో యువకులు టీడీపీ, జనసేన, బీజేపీ కూటమిలో జాయిన్ అయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో కూటమి అధికారంలోకి రావడం ఖాయమన్నారు.

● రాష్ట్ర భవిష్యత్తుకు దిక్సూచిలా చిలకలూరి పేట బహిరంగ సభకు ప్రజాస్వామ్యవాదులంతా హాజరై విజయవంతం చేయాలని మాజీ మంత్రి పితాని సత్యనారాయణ అన్నారు. శనివారం మునమర్రు కొఠాలపర్రు గ్రామాల్లో ప్రజల వద్దకు పితాని ఎన్నికల పాదయాత్ర నిర్వహించి అనంతరం విలేకరుల సమావేశం నిర్వహించారు. టీడీపీ జనసేన బీజేపీ ఉమ్మడి సభ ప్రజా గళం బహిరంగ సభకు తరలి రావాలన్నారు. రాష్ట్రంలో అరాచక విధ్వంస పాలనకు అంతిమ గడియాలు ప్రారంభమయ్యాయన్నారు. చట్టాలను తుంగలో తొక్కి అధికార దుర్వినియోగంకు పాల్పడిన వ్యక్తి ఎమ్మెల్యే రంగరాజు అని ధ్వజమెత్తారు. పెనుమంట్ర మండలం బ్రాహ్మణ చెరువులో రిజర్వు స్థలంలో పార్టీ నాయకులకు కట్టబెట్టేందుకు వెళ్ళిన ఎమ్మెల్యే మహిళలను అగౌరపరుస్తూ మాట్లాడటం దుర్మార్గమన్నారు.

జగన్ పాలనను తరిమేద్దాం

నరసాపురం రూరల్, మార్చి 16: రాష్ట్రంలో జగన్ పాలనను తరిమేసే అవకాశం వచ్చిందని, ప్రజలంతా రాష్ట్రాభివృద్ధికి పాటుపడే జనసేన, టీడీపీ, బీజేపీ కూటమికే ఓట్లు వేయాలని జనసేన కన్వీనర్ బొమ్మిడి నాయకర్ అన్నారు. శనివారం మండలంలోని కే బేతపూడి గ్రామంలో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఐదేళ్ళల్లో నియోజకవర్గంలో జరిగింది శూన్యమన్నారు. శిలాఫలాకాలు, శంకుస్థాపనలతో ప్రభుత్వం దగా చేసిందన్నారు. తనను గెలిపిస్తే నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వలవల నాని, మార్రాజు, బందెల రవీంద్ర, జక్కం బాబ్జీ, ఆకన చంద్రశేఖర్, సముద్రాల సత్యవతి, పాలి బాబులు, దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

నా మిత్రుడిని భారీ మెజార్టీతో గెలిపిద్దాం : వలవల

తాడేపల్లిగూడెం రూరల్, మార్చి 16: తన మిత్రుడు బొలిశెట్టి శ్రీనివాస్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వలవల బాబ్జి పిలుపునిచ్చారు. తాడేపల్లిగూడెంలో శనివారం టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర భవిష్యత్ దృష్ట్యా కూటమిలో సీటు దక్కించుకున్న బొలిశెట్టిని గెలిపించుకుని మన సత్తా చాటుదాం అన్నారు. తనకు టీడీపీ అధినేత చంద్రబాబు న్యాయం చేస్తామన్నారని ఆ న్యాయం చేసేది కార్యకర్తల కోసం చేయాలని కోరానన్నారు. కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి బొలిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ తాను మున్సిపల్ చైర్మన్‌గా ఉన్న సమయంలో రెండో సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు కోసం ఎంతో కష్టపడ్డామని చివరకు ఎన్నికలు రావడంతో ప్రారంభించలేకపోయామన్నారు. రూ.32 కోట్ల పనులకు మంత్రి రూ.3 కోట్లు కే ట్యాక్స్ కట్టాలనడంతో ఆ కాంట్రాక్టర్ పని చేయకుండా వెళ్లిపోయాడన్నారు. రాబోయేది మన ప్రభుత్వమేనని అధికారంలోకి రాగానే ఆరునెలల్లోపే రోడ్లన్నీ వేస్తామని, వచ్చే వేసవి కల్లా రెండో సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు పూర్తిచేస్తామని హామీ ఇచ్చారు. టీడీపీ నాయకులు గొర్రెల శ్రీధర్, పోతుల అన్నవరం, పరిమి రవికుమార్, దాసరి అప్పన్న, గంధం సతీష్, కిలపర్తి వెంకట్రావు, పాతూరి రాంప్రసాద్ చౌదరి, జనసేన నాయకులు కసిరెడ్డి మధులత, వుల్లా బాబి, అడపా ప్రసాద్, పైబోయిన రఘు, బీజేపీ నాయకులు భోగిరెడ్డి ఆదిలక్ష్మి, నరిసే సోమేశ్వరరావు, పసుపులేటి వెంకట రామారావు మాట్లాడారు.

జగన్ పీడ వదిలిందంటూ సంబరాలు

పాలకొల్లు టౌన్, మార్చి 16: ఎన్నికల కోడ్ రావడంతో రాష్ట్రంలో జగన్ పీడ వదిలిందంటూ పాలకొల్లులో గాంధీబొమ్మల సెంటర్లో శనివారం టీడీపీ, జనసేన శ్రేణులు బాణసంచా కాల్చి సంబరాలు నిర్వహించారు. అందరికీ మిఠాయిలు పంచారు. మరో రెండు నెలల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాబోతుందని, రాష్ట్ర భవిష్యత్తుతో పాటు అన్ని వర్గాల ప్రజలకు మేలు జరుగుతుందని కూటమి శ్రేణులు తెలిపారు. కార్యక్రమంలో పాలకొల్లు పట్టణ టీడీపీ అధ్యక్షుడు గండేటి వెంకటేశ్వరరావు, రాష్ట్ర టీడీపీ కార్యదర్శి పెచ్చెట్టి బాబు, నాయకులు మీసాల రాము, మండెల రాంప్రసాద్, వీరా రామకృష్ణ, బందెల భాస్కరరావు, అన్నాబత్తులు దుర్గాభాస్కర్, బాలి మణికంత, మల్లుల వెంకట్, బిల్లా లక్ష్మీనారాయణ, పినిశెట్టి శ్రీను పాల్గొన్నారు.

నరసాపురం టౌన్: ఎన్నికల నోటిఫికేషన్‌తో రాష్ట్రంలో సైకో జగన్ పాలనకు విముక్తి లభించిందని ఇన్‌చార్జి పొత్తూరి రామరాజు అన్నారు. శనివారం నోటిఫికేషన్ వెలువడగానే పార్టీ కార్యాలయంలో బాణసంచా కాల్చి మిఠాయిలు పంచిపెట్టారు. ఆపద్ధర్మ ముఖ్యమంత్రిగా ఉన్న జగన్ మూడు నెలల్లో శాశ్వతంగా ఇంటికి పరిమితమవుతారన్నారు. ఈసారి ప్రజలు పని చేసే ప్రభుత్వానికే ఓటు వేస్తారన్నారు. కార్యక్రమంలో జక్కం శ్రీమన్నారాయణ, కొప్పాడ రవి, గుబ్బల నాగరాజు, జోగి పండు, మల్లాడి మూర్తి, సంకు భాస్కర్, పద్మ, సునీత తదితరులు పాల్గొన్నారు.





భీమవరంలో పొట్టి శ్రీరాములు విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న కలెక్టర్ సుమిత్ కుమార్.. పోలీసుల నివాళులు.. జనసేన నేత అంజిబాబు నివాళులు

చిరస్మరణీయుడు పొట్టి శ్రీరాములు

ఘనంగా అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి

భీమవరం, మార్చి 16 : ఆంధ్ర రాష్ట్ర సాధన కోసం ఆమరణ నిరాహారదీక్ష చేసి, ప్రాణాలర్పించిన పొట్టి శ్రీరాములు చిరస్మరణీయులని జిల్లా కలెక్టరు సుమిత్ కుమార్ అన్నారు. శనివారం జిల్లా కలెక్టరు కార్యాలయంలో జిల్లా వెనుక బడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు 124వ జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించగా ఆయన పాల్గొని మాట్లాడారు. తొలుత జిల్లా కలెక్టరేట్ ప్రాంగణంలో ఉన్న అమరజీవి పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి జిల్లా కలెక్టరు నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టరు మాట్లాడుతూ భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటుకు విశేష కృషి చేసిన మహాపురుషుడు పొట్టి శ్రీరాములు అని అన్నారు. తను చనిపోతానని తెలిసి కూడా తన లక్ష్యం సాధించడంకోసం పోరాడుతూ ప్రాణత్యాగం చేశారన్నారు. జిల్లా రెవెన్యూ అధికారి జె.ఉదయ భాస్కరరావు, ట్రైనీ డిప్యూటీ కలెక్టరు, జిల్లా గృహ నిర్మాణ శాఖ పీడీ కానాల సంగీత్ మాధుర్ పాల్గొన్నారు.

పెనుమంట్ర: మార్టేరులోని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం, వ్యవసాయ పాలిటెక్నిక్‌లలో అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి వేడుకలు నిర్వహించారు. ఇన్‌చార్జి ఎ.డి.ఆర్. డా. టి. శ్రీనివాస్, ప్రధాన శాస్త్రవేత్త (రైస్), ఇతర శాస్త్రవేత్తలు పాల్గొన్నారు. అమరజీవి పొట్టి శ్రీరాములు చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

భీమవరం టౌన్: హౌసింగ్ బోర్డు కాలనీలో పొట్టి శ్రీరాములు జయంతి నిర్వహించారు. పొట్టి శ్రీరాములు చేసిన సేవలు గురించి కొనియాడారు. కంతేటి వెంకటరాజు, సరిపిడకల రామారావు సయ్యపరాజుసూర్యనారాయణ రాజు అల్లూరి బంగార్రాజు జానపాటి మధు చెరుకువాడ రంగసాయి మడిపల్లి శేఖర్, కెవిఎస్ భాస్కర రావు కడలి వెంకటేశ్వరరావు మారిశెట్టి రాంప్రసాద్ ఇంజనీరింగ్ కృష్ణంరాజు పాల్గొన్నారు.

నరసాపురం టౌన్: పట్టణంలోని బీజీబీఎస్ మహిళా కళాశాలలో అమరజీవి పొట్టి శ్రీరాములు చిత్రపటానికి కరస్పాండెంట్ నూలి శ్రీనివాస్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన చేసిన పోరాటాలను స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ కె. మధుశాలిని, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి కె.రజిని పాల్గొన్నారు.

● ఆంధ్ర రాష్ట్ర సాధన కోసం ఆమరణ నిరాహార దీక్ష చేసి ప్రాణాలర్పించిన పొట్టి శ్రీరాములు చిరస్మరణీయులని జనసేన పార్టీ నాయకులు పులపర్తి రామాంజనేయుల (అంజిబాబు) అన్నారు. మావుళ్ళమ్మ అమ్మవారి దేవస్థానం రోడ్డులోని పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రత్యేక తెలుగు రాష్ట్రం సాధన కోసం 58 రోజులు నిరాహార దీక్ష చేసి ప్రాణాలు వదిలిన మహాత్యాగి పొట్టి శ్రీ రాములని అన్నారు.

గణపవరం: పొట్టి శ్రీరాములు చిరస్మరణీయుడని వివేకానంద సేవా సమితి అధ్యక్షుడు అల్లూరి గంగరాజు అన్నారు. శనివారం స్థానిక గణపవరం వివేకానంద సేవా సమితి కార్యాలయంలో పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. చింతలపాటి సూర్పరాజు, జి.గోపాలకృష్ణంరాజు, నడిపల్లి శ్రీరామ్, నడిపల్లి కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

భీమవరం క్రైం: జిల్లా పోలీసుశాఖ ఆధ్వర్యంలో అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతిని జిల్లా పోలీసు కార్యాలయంలో శనివారంనాడు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్) శ్రీ వి. భీమారావు ముఖ్య అతిథిగా హాజరై, అమరజీవి పొట్టి శ్రీరాములు చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఆయన మాట్లాడుతూ మద్రాసు రాజధానిగా ఉన్న ఉమ్మడి రాష్ట్రంలో తెలుగు వారి బాధలపై ఉద్యమించి, భాషా ప్రయుక్త రాష్ట్రం కావాలని ఉద్యమించి, ఆమరణ నిరాహారదీక్ష చేపట్టి, అమరులు అయ్యారన్నారు. పొట్టి శ్రీరాములు మరణానంతరం ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం ఏర్పడిందని అన్నారు. జిల్లా ఆర్మ్‌రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ (అడ్మిన్) టి.శ్రీకాంత్, ఆర్మ్ రిజర్వు సిబ్బంది పాల్గొన్నారు.

లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే కేసుల నమోదు

నరసాపురం, మార్చి 16: స్కానింగ్ సెంటర్లలో లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని డిప్యూటీ డీఎంహెచ్‌వో ప్రసాద్ హెచ్చరించారు. శనివారం కార్యాలయంలో నిర్ధారణ కమిటీ సభ్యులు, స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులతో ఆయన సమావేశాన్ని నిర్వహించారు. తరుచూ స్కానింగ్ సెంటర్లను తనిఖీ చేయాలని, వాటిపై నిఘా ఉంచాలన్నారు.

వేసవిలో మంచినీటి ఎద్దడి లేకుండా చూడాలి

భీమవరం టౌన్, మార్చి 16 : పట్టణ పరిధిలో రానున్న వేసవి దృష్ట్యా మంచి నీటి సరఫరాలో ఎటువంటి ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకోవాలని మునిసిపల్ కమిషనర్ ఎం.శ్యామల ఆదేశించారు. పబ్లిక్ హెల్త్, మునిసిపల్ ఎంఈ, ఏఈలతో వేసవిలో మంచినీటి సరఫరాపై సమీక్ష నిర్వహించారు. మొదటగా శివారు ప్రాంతాలలో మంచి నీటి సరఫరా సజావుగా సాగేలాచూడాలని అధికారులను ఆదేశించారు. పట్టణంలో ఎక్కడా లీకేజీలు లేకుండా చూడాలన్నారు.

మొత్తం పన్ను చెల్లిస్తే వడ్డీ రాయితీ

నరసాపురం టౌన్, మార్చి 16: వినియోగదారులు పన్ను బకాయిల మొత్తం చెల్లిస్తే వడ్డీ రాయితీ ఉంటుందని కమిషనర్ వెంకటేశ్వరావు తెలిపారు. సెలవు రోజులైనా మునిసిపాలిటీ, సచివాలయ కార్యాలయాలు పని చేస్తాయన్నారు. గడువు మరో 15 రోజులు ఉన్నందున పెండింగ్ బకాయిదారులు పన్నులన్ని చెల్లించాలని విన్నవించారు. ఏప్రిల్ 1 నుంచి పన్నుపై వడ్డీ యథావిధిగా ఉంటుందన్నారు.

టెన్త్ విద్యార్థులకు మెటీరియల్ అందజేత

ఉండి, మార్చి 16: ఉణుదుర్రులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గ్రామానికి చెందిన వజ్రపు జశ్వంత్ ఆర్థిక సహకారంతో విద్యార్థులకు ఉచితంగా మెటీరియల్‌ను అందించారు. గ్రామానికి చెందిన న్యాయవాది గొర్రెముచ్చుల సుందరకుమార్ చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌యం రత్నకుమారి, సోమరాజు పాల్గొన్నారు.

వేల్పూరు శ్రీచైతన్య విద్యార్థుల ప్రతిభ



తణుకు, మార్చి 16: ఐఎస్‌టీఎస్‌ఏ జాతీయ ఒలింపియాడ్ పరీక్షల్లో వేల్పూరు శ్రీచైతన్య విద్యార్థులు ప్రభంజనం సృష్టించారని ప్రిన్సిపాల్ కొంపెల్ల పుష్పలత తెలిపారు. 200 మంది విద్యార్థులు సెకండ్ లెవల్‌లో పాల్గొనగా వారిలో 170 మంది విద్యార్థులు బహుమతులు సాధించారన్నారు. మొదటి బహుమతిగా లెనోవోట్యాబ్, రెండో బహుమతిగా స్మార్ట్ వాచ్, మూడో బహుమతిగా వాచ్‌తో పాటు బంగారు పతకాలు కూడా పొందారన్నారు. అలాగే ఐదో బహుమతిగా గిఫ్ట్ ప్యాక్-3, 20 కన్సొలేషన్ బహుమతులు, 60 బంగారు పతకాలు, 70 మెరిట్ సర్టిఫికెట్లు సాధించారని తెలిపారు. పాఠశాలలో జరిగిన విద్యార్థుల అభినందన సభలో ఏజీఎం పార్థసారథి, ఆర్ఐ రాజ్‌కుమార్, కో-ఆర్డినేటర్ కిరణ్‌పాండే, ప్రైమరీ కోఆర్డినేటర్ లావణ్య, సి బ్యాచ్ ఇన్‌చార్జి రాము, ప్రైమరీ ఇన్‌చార్జి వాణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పది పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి


పాతపాడు పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు సూచనలిస్తున్న ఎంఈవో శామ్యూల్ జాన్

మొగల్తూరు, మార్చి 16: ఈనెల 18వ తేదీ నుంచి జరగబోయే పదో తరగతి పరీక్షలకు ఏర్పాట్లు పూర్తిచేసినట్లు ఎంఈవో శామ్యూల్ జాన్ తెలిపారు. శనివారం పాతపాడు ఉన్నత పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు పలు సూచనలు చేశారు. ప్రతీ విద్యార్థి ఒత్తిడికి గురికాకుండా పది పరీక్షలకు మానసికంగా సిద్ధంగా ఉండాలన్నారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని పది ఉన్నత పాఠశాలల నుంచి 620 మంది, ఆరు ప్రైవేట్ పాఠశాలల నుంచి 150 మంది పరీక్షలకు హాజరుకానున్నారన్నారు. మండలంలో ఆరు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. ముత్యాలపల్లి, కెపిపాలెం, జగన్నాథపురం, శేరేపాలెం, మొగల్తూరులోని ఏ,బి సెంటర్లను ఏర్పాటు చేశామని తెలిపారు.

ఆచంట: మండలంలో మొత్తం 264 మంది బాలురు,264 మంది బాలికలు తో పాటు మరో 277 మంది ప్రవేటు విద్యార్థులు పది పరీక్షలకు హాజరవుతున్నారని మండల విద్యాశాఖాధికారులు పి.రాజేంద్ర ప్రసాద్, ఎ.ఉషారాణి తెలిపారు. కొడమంచిలి, వల్లూరు ఎంపీపాలెం, ఆచంట, వేమవరం సెంటర్‌లలో పరీక్షలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు.

ప్రొటోకాల్ పాటించని సర్పంచ్

ఆచంట, మార్చి 16: ఆచంట శివారు కౌరుపాలెంలో నూతనంగా నిర్మించిన పాఠశాల భవనం ప్రారంభోత్సవం కార్యక్రమంలో తనకు ఎటువంటి సమాచారం ఇవ్వకుండా ప్రొటోకాల్ పాటించకుండా గ్రామసర్పంచ్ కోట సరోజిని ప్రారంభించడాన్ని ఎంపీటీసీ ఉల్లం జ్యోతి శనివారం ఒక ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. కనీసం పాఠశాల వద్ద శిలాఫలకం ఏర్పాటు చేయకుండానే అధికారులు లేకుండానే సర్పంచ్ తమకు ఎటువంటి అధికారం లేకపోయినా ప్రారంభోత్సవం చేయడం పట్ల ఎంపీటీసీ తీవ్రంగా ఖండించారు.

లోక్ అదాలత్‌లో 818 కేసుల రాజీ



అదాలత్‌లో పాల్గొన్న న్యాయాధికారులు

ఇరగవరం, మార్చి 16: తణుకు కోర్టు ఆవరణలో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో రూ. 98,04,710 విలువగల 818 కేసులు రాజీ అయ్యాయని తణుకు మండల లీగల్ సెల్ కమిటీ చైర్మన్, 4వ అదనపు జిల్లా న్యాయాధికారి డి. సత్యవతి తెలిపారు. సీనియర్ సివిల్ న్యాయాధికారి కె. కృష్ణ సత్యలత, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ న్యాయాధికారి పి. సాయిరాం, ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ నాగరాజు, అడ్వొకేట్ మెంబర్లు పి. సుబ్బయ్య, కౌరు వెంకటేశ్వర్లు, కిరణ్మయి, సోమేశ్వరరావు పాల్గొన్నారు.

19 నుంచి కనక దుర్గమ్మ కల్యాణ ఉత్సవాలు



పాలకొల్లు అర్బన్, మార్చి 16 : ఈనెల 19వ తేదీ నుంచి యడ్ల బజారులోని శ్రీ కనక దుర్గమ్మ కల్యాణ ఉత్సవాలు నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. ఆలయానికి రంగులు వేసి విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఈసందర్భంగా శనివారం అమ్మవారికి మహిళలు ప్రత్యేకంగా కుంకుమ పూజలు చేసుకున్నారు. కార్యక్రమంలో కార్యనిర్వహణాధికారి ఎన్.సతీష్ కుమార్, పాలక మండలి చైర్మన్ కావలి శ్రీనివాసరావు తెలిపారు. 19వ తేదీన కల్యాణ ఉత్సవాలు ప్రారంభం, 20వ తేదీ రాత్రి శ్రీ కనక దుర్గమ్మవారితో శ్రీమల్లేశ్వర స్వామి కల్యాణం అత్యంత వైభవంగా నిర్వహిస్తామని తెలిపారు. దీనిలో భాగంగా ఈనెల 27వ తేదీ వరకూ ప్రతీ రోజు అమ్మవారికి సహస్ర కుంకుమార్చనలు, పూజలు, రాత్రి సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్టు వారు తెలిపారు. 24వ తేదీ ఉదయం ఆలయం వద్ద అఖండ అన్న సమారాధన ఏర్పాటు చేసినట్టు వారు తెలిపారు.

ముగిసిన చెస్ శిక్షణ

భీమవరం అర్బన్, మార్చి 16: సెయింట్ మేరీస్ హైస్కూల్‌లో జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న ఉచిత శిక్షణ శిబిరం శనివారం ముగిసింది. స్కూల్ ప్రధానోపాధ్యాయురాలు ఎస్‌టీ విజయ, జిల్లా చెస్ అసోసియేషన్ అధ్యక్షుడు మాదాసు కిషోర్, సంఘ సేవకులు అల్లు శ్రీనివాస్, కోచ్ పెదపాటి రవికుమార్ పాల్గొన్నారు.

తోట జగదీష్‌కు జన్మదిన శుభాకాంక్షలు

భీమవరం అర్బన్, మార్చి 16: తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షురాలు తోట సీతారామలక్ష్మి తనయుడు తోట జగదీష్ పుట్టినరోజును పురస్కరించుకుని శనివారం తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు మద్దుల రాము, గంటా త్రిమూర్తులు, యలమంచిలి శ్రీను, వినయ్, అమర్‌బాబు తదితరులు జగదీష్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

పౌరసత్వ చట్ట సవరణను వ్యతిరేకించాలి


మాట్లాడుతున్న ఆవాజ్ రాష్ట్ర కార్యదర్శి సీస్టీ

ఆకివీడు, మార్చి 16: దేశాన్ని బలహీనపరిచే పౌరసత్వ చట్ట సవరణను వ్యతిరేకించాలని ఆవాజ్ రాష్ట్ర కార్యదర్శి ఎండీ సీస్టీ అన్నారు. శనివారం స్థానిక షాదీఖానాలో సీఏఏ చట్టం అమలును అడ్డుకోవాలంటూ సమావేశం నిర్వహించి మాట్లాడారు. మత ప్రాతిపదికను తీసుకొచ్చిన సీఏఏను అందరూ వ్యతిరేకించాలన్నారు. దేశంలో హిందువులు, ముస్లింలకు మధ్య విబేధాలు సృష్టించి రాబోయే ఎన్నికల్లో లబ్ధి పొందాలని బీజేపీ ప్రభుత్వం చూస్తుందన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా నాయకుడు జేఎన్వీ గోపాలన్, ముస్లిం అసోసియేషన్ అధ్యక్షుడు ఎండీ మదనీ, అహ్మద్, జక్కీ, కె.తవిటినాయుడు, షేక్ వలీ, పెంకి అప్పారావు పాల్గొన్నారు.

అఖండ అన్నసమారాధన

ఆకివీడు, మార్చి 16: అగస్త్యేశ్వరస్వామి దేవాలయంలో శివరాత్రి ఉత్సవాలు ముగింపు సందర్భంగా శనివారం అఖండ అన్నసమారాధన జరిగింది. భక్తులు స్వామిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలు, భోజనం స్వీకరించారు. వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పీవీఎల్ నర్సింహరాజు, భీమవరం పరిశీలకులు మోటుపల్లి గంగాధరరావు, నిర్వాహకులు వాడపల్లి బ్రదర్స్ అండ్ సిస్టర్స్ తదితరులు పాల్గొన్నారు.

యాగశాలలో ప్రత్యేక పూజలు

ఆకివీడు, మార్చి 16: వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవాలయ నూతన నిర్మాణం, విగ్రహాలు పునఃప్రతిష్ఠలో భాగంగా శనివారం యాగశాలలో నిర్వాహకులతో వేదపండితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు స్వామిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ నెల 20న స్వామి విగ్రహ పునఃప్రతిష్ఠ జరుగుతుండడంతో జయప్రదం చేయాలని నిర్వాహకులు కోరారు.

ఆలయ పాలకవర్గం ప్రమాణం

ఆకివీడు, మార్చి 16: మదనగోపాలస్వామి దేవస్థానానికి చైర్మన్‌గా భమిడిపాటి సూర్యభాస్కరరావు, సభ్యులుగా పర్తికాయల వెంకటలక్ష్మి, సన్నిధి వెంకట నారాయణరావు, ధనాల నాగమణి, పిట్టా పాండురంగారావు, తీపర్తి రాఘవమ్మ, బూరాడ లక్ష్మి, అర్చకులుగా సుదర్శనం రాధా కృష్ణమాచార్యులతో దేవదాయశాఖ అధికారులు ప్రమాణస్వీకారం చేయించారు. కార్యక్రమంలో దేవస్థానం మేనేజర్ సాగి రంగరాజు, వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పీవీఎల్ నరసింహరాజు, నగర పంచాయతీ చైర్మన్ జామి హైమావతి, భీమవరం పరిశీలకులు మోటుపల్లి గంగాధరరావు, జగ్గురోతు విజయ్‌కుమార్, మోరా జ్యోతిరెడ్డి-శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఆచంట, మార్చి 16: విద్యుత్ మరమ్మతులు, చెట్ల కొమ్మలు తొలగింపు కారణంగా ఆచంట, వేమవరం, కొడమంచిలి, కోడేరు, పెదమల్లం, వల్లూరు, భీమలాపురం, కరుగోరుమిల్లి, అయోధ్యలంక, అలాగే పోడూరు మండలంలోని వద్దిపర్రులో ఆదివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్టు ఎలక్ట్రికల్ నరసాపురం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బి. సురేష్ కుమార్ తెలిపారు.

ఎన్నికల నియమావళి పాటించాలి : ఎంపీడీవో

ఇరగవరం, మార్చి 16 : ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలుకు రాజకీయ పార్టీలు సహకరించాలని ఎంపీడీవో శ్రీ లలిత కోరారు. తణుకు మండల పరిషత్ కార్యాలయంలో శనివారం సమావేశం నిర్వహించి మాట్లాడుతూ మండలంలోని వివిధ ప్రభుత్వ కార్యాలయాల వద్ద ఏర్పాటు చేసిన రాజకీయ పార్టీల ఫ్లెక్సీలు, బోర్డులను ఆయా పార్టీల నాయకులే స్వచ్ఛందంగా తొలగించాలని కోరారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని స్థానిక సచివాలయ స్థాయిలో నిరంతరం పర్యవేక్షించడం జరుగుతుందన్నారు.

దేవుడా..
చినవెంకన్న క్షేత్రంలో భక్తులకు ఇక్కట్లు

సాంకేతిక లోపంతో సర్వర్‌డౌన్..


టోల్‌గేట్ వద్ద వాహనాలు కౌంటర్ల బయట టికెట్‌లు ఇస్తున్న సిబ్బంది


ద్వారకాతిరుమల కేశఖండన శాల కౌంటర్ వద్ద భక్తులు

» గంటల తరబడి కౌంటర్ల వద్ద వేచి వున్న భక్తులు

ద్వారకాతిరుమల, మార్చి16: శ్రీవారి క్షేత్రంలో సర్వర్ డౌన్ కావడంతో ఆలయానికి వచ్చిన భక్తులు గంటల తరబడి క్యూలైన్లలో వేచి ఉండి తీవ్ర ఇబ్బందులపాలయ్యారు. ప్రతీ శనివారం మాదిరిగా క్షేత్రానికి వేలాదిమంది భక్తులు విచ్చేశారు. ఈక్రమంలోనే ఆలయానికి వచ్చిన యాత్రికులకు కంప్యూటర్ ద్వారా టికెట్లను అందించే క్రమంలో సర్వర్ సాంకేతిక లోపం కారణంగా ఒక్కసారిగా డౌన్‌అయింది. సరిగ్గా పనిచేయకపోవడంతో కేశఖండనశాల, ప్రసాదాల కౌంటర్ల వద్ద భక్తులు క్యూలైన్లలో నిలబడిపోయారు. మాన్యువల్ పద్ధతిలో టికెట ను అందజేస్తున్నా భక్తుల తాకిడి కారణంగా సకాలంలో ఇవ్వలేక పోవడం వల్ల మహిళలు, వృద్ధులు, చిన్నపిల్లల తల్లులు క్యూలైన్లలో నిలబడి ఇబ్బందులు ఎదుర్కొన్నారు. టోల్‌గేట్ వద్ద వాహనాలునిలిచి పోవడంతో ఆప్రాంతం రద్దీగా మారింది. సిబ్బంది మాన్యువల్‌గా టికెట్లను అందించారు. ఆలయంలో సైతం కౌంటర్ల బయట సిబ్బంది మాన్యువల్‌గా టికెట్లను ఇచ్చి డబ్బులు కవర్లలో వేశారు. చాలాసేపటి తరువాత సర్వర్ పనిచేయడంతో టికెట్లను అందించారు.


శనివారం అనివేటి మండప ప్రాంగణంలో భక్తులు

భక్తుడిపై శునకం దాడి

» ఊడి పడిన వేలి చివరి భాగం.. ఆసుపత్రికి తరలింపు..

ద్వారకాతిరుమల, మార్చి16: శ్రీవారి దేవస్థానం వకుళమాత అన్నప్రసాద భవనం వద్దకు వెళ్లిన ఓ భక్తుడిపై శునకం దాడికి పాల్పడిన ఘటన శుక్రవారం జరిగినా శనివారం వెలుగు చూసింది. ఉండి మండలం పెదపుల్లేరుకు చెందిన శ్రీనివాసవర్మ కుటుంబ సమేతంగా శ్రీవారి దర్శనానికి విచ్చేశారు. దర్శనానం తరం అన్నప్రసాదానికి సంబంధిత భవనం వద్దకు వెళ్లారు. ఇదే సమయంలో అక్కడ ఉన్న ఓ కుక్క అతడిపై విచక్షణారహితంగా దాడి చేసి గాయపరిచింది. వేలు చివరి భాగం ఊడి పడడంతో హడలెత్తిన కుటుంబం బాధితుడిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు.

ఆలయ పరిసరాల్లో శునకాలు

క్షేత్రపరిసరాల్లో శునకాలు సంచరిస్తున్నా అధికారులు చూసీచూడనట్టు వ్యవహరిస్తున్నారు. కొన్ని శునకాలు రోగాల బారిన పడి క్షేత్ర పరిసరాల్లో సంచరిస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు చర్యలు చేపట్టాలని భక్తులు, స్థానికులు కోరుతున్నారు.


రోగాల బారిన పడిన శునకం తెగిన వేలును చూపుతున్న భక్తుడు


అనివేటి మండపంలో సంచరిస్తున్న శునకం

అనియత విద్య సిబ్బందికి ఎంటీఎస్ నియామకాలపై కసరత్తు

» ఉమ్మడి పశ్చిమ జిల్లాలో సమాచార సేకరణకు ఆదేశాలు

ఏలూరు ఎడ్యుకేషన్, మార్చి 16:బాల కార్మికులకు రాత్రిపూట బడుల్లో విద్యనందించేందుకు దశాబ్దాల క్రితం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులతో ఏర్పాటైన అనియతవిద్య (నాన్‌ఫార్మల్ ఎడ్యుకేషన్) కేంద్రాల్లో పనిచేసిన సిబ్బందిని తాజాగా స్కూల్ కాంప్లెక్స్‌ల పరిధిలో ఖాళీగా వున్న పార్ట్‌టైం ఉపాధ్యాయ పోస్టులు, ఎంటీ ఎస్ టీచర్లుగా నియమించే ప్రక్రియ నిమిత్తం ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో మండలాల వారీగా ప్రస్తుతం వున్న అనియతవిద్య సిబ్బంది వివరాలను ఈనెల 20వ తేదీలోగా సేకరించి పంపాలని సమగ్రశిక్ష జిల్లా అధికారులకు ఆదేశాలు అందాయి. ఈ మేరకు సమగ్రశిక్ష రాష్ట్ర ప్రాజెక్టు డైరెక్టర్ నుంచి జిల్లాకు ఉత్తర్వులను పంపారని ఏపీ నాన్ ఫార్మల్ ఎడ్యుకేషన్ స్టాఫ్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు బి.వెంకన్న ఓ ప్రకటనలో పేర్కొన్నారు. గౌరవవేతనంపై పనిచేసే అనియతవిద్య ఉపాధ్యాయ, సూపర్‌వైజర్ సిబ్బందిని 2001 మార్చి 31న నిలిపి వేశారని, ఉభయ తెలుగు రాష్ట్రాల విభజన తర్వాత కూడా తమ ఉద్యోగాలకోసం ప్రభుత్వాలను డిమాండ్ చేస్తున్నప్పటికీ పట్టించుకోలేదని ఆరోపించారు. అనియిత విద్యా పథకం కింద ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో మొత్తం 1200 మంది సిబ్బంది ఉండగా, వీరిలో పలువురు చిన్నపాటి ఉద్యోగాలు, ఇతర వృత్తులకు తరలిపోయారని, ప్రస్తుతంవున్న వారిలో గతంలో పనిచేసిన 80మంది సూపర్ వైజర్లు, 220 మంది ఇన్‌స్ట్రక్టర్లు మాత్రమే అందుబాటులో ఉన్నారని వివరించారు. ఇటీవల తాము విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణను కలుసుకుని తమను డీఎస్సీ-1998 ఉపాధ్యాయుల మాదిరిగా కనీస వేతనస్కేలు (ఎంటీఎస్)పై నియమించాలని చేసిన అభ్యర్థనపై సానుకూలంగా స్పందించి, ఎస్ఎస్ఏ రాష్ట్ర అధికారులకు ఆదేశాలిచ్చారని తెలిపారు. ఈక్రమంలో జిల్లాల వారీగా అనియత విద్య పథకంలో పనిచేసిన సిబ్బంది వివరాలను తక్షణమే పంపాలని డీఈవోలకు, సమగ్రశిక్ష ఏపీసీలకు ఉత్తర్వులు జారీచేసిందని వివరించారు. జిల్లా అధికారులు వెంటనే స్పందించి ఎంఈవోల ద్వారా పూర్తి సమాచారాన్ని రప్పించుకుని ఎస్పీడీకి పంపాలని శనివారం డీఈవో అబ్రహంను కలిసి కోరామన్నారు. దీనిపై సమగ్రశిక్ష జిల్లా అధికారులు తక్షణమే చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

నిట్ ఆచార్యుడు రాముడికి జాతీయ ప్రాజెక్టు



పెంటపాడు, మార్చి 16 : ఏపీ నిట్‌లో సేవలందిస్తున్న ఆచార్యుడు డాక్టర్ మాచవరపు రాముడికి సుమారు రూ.25 లక్షల విలువైన జాతీయ ప్రాజెక్టు మంజూరవ్వడం అభినందనీయమని ఏపీ నిట్ రిజిస్ట్రార్ డాక్టర్ పి.దినేష్‌శంకర్‌రెడ్డి కొనియాడారు. ఈ మేరకు శనివారం ఆచార్యుడు రాముడుని నిట్ ఇన్‌చార్జి డైరెక్టర్ డాక్టర్ బీఎస్.మూర్తితో కలసి ప్రత్యేకంగా అభినందించి మాట్లాడారు. స్పింట్రోనిక్ అనువర్తనాల కోసం మాంగనీస్ ఆధారిత యాంటిఫెరో మాగ్నెట్ హెస్యాస్లర్ పదార్థాల అభివృద్ధి అనే ప్రాజెక్టుకి సంబంధించి పరిశోధించనున్నారన్నారు. ప్రాజక్టు నిధులను భారత ప్రభుత్వ ఆధీనంలోని సైన్స్ అండ్ ఇంజనీరింగ్ రీసెర్చ్ బోర్డు(సెర్బ్), కోర్ రీసెర్చ్ గ్రాంట్ నుంచి కేటాయించారన్నారు. ప్రాజక్టు పదవీ కాలం మూడేళ్లు ఉంటుందన్నారు. డీన్‌లు డాక్టర్ జీఆర్‌కే శాస్త్రి, డాక్టర్ టి.కురుమయ్య, డాక్టర్ ఎన్.జయరాం, డాక్టర్ జీబీ వీరేష్‌కుమార్, ఆచార్యులు డాక్టర్ వి.సందీప్, డాక్టర్ అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి భీమవరంలో టెన్నిస్ టోర్నమెంట్

భీమవరంటౌన్, మార్చి 16 : కాస్మో పాలిటన్ క్లబ్ ఆధ్వర్యంలో ఆలిండియా సీని యర్ ర్యాంకింగ్ టెన్నిస్ టోర్నమెంట్ ఈనెల 18 నుంచి 24వ తేదీ వరకు భీమవరం కాస్మో పాలిటిన్ క్లబ్‌లో నిర్వహిస్తున్నామని క్లబ్ అధ్యక్షుడు అల్లూరి పద్మరాజు, కార్యదర్శి పెన్మెత్స వెంకటరామరాజు శనివారం తెలిపారు. మెన్స్ డబుల్స్ 35+, 45+,55+,65+,70+,75+విభాగంలో టోర్నమెంట్ జరుగుతుంద న్నా రు. క్రీడాకకారులకు ఉచిత భోజనం సదుపాయం కల్పిస్తున్నామని, గత మూడేళ్లుగా ఈ పోటీలను చేపడుతున్నామన్నారు. 18,19 తేదీల్లో క్వాలిఫైయింగ్ పోటీలు నిర్వహిస్తామన్నారు. ఈ పోటీలకు భీమవరంలోని కాస్మో, ఎల్‌హెచ్ టౌన్‌హాల్, డీఎన్నార్, ఎస్ఆర్ కేఆర్ కళాశాల క్రాడామైదానంలోని ఎనిమిది కోర్టుల్లో పోటీలు నిర్వహిసామన్నారు. ప్రధాన పోటీలు కాస్మోపాలిటిన్ క్లబ్‌లో చేపడతా మన్నారు. పలు రాష్ట్రాల నుంచి 200 మంది క్రీడాకారులు పాల్గొంటున్నారన్నారు. 20న హైదరాబాద్‌కు చెందిన వెర్టెక్స్ హోమ్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఎండీ వీవీఆర్ వర్మ పోటీలను ప్రారంభిస్తారన్నారు. క్లబ్ సెక్రటరీ వీవీఎస్ సుబ్రహ్మణ్యవర్మ, జాయింట్ సెక్రటరీ కురిశెట్టి సత్యనారాయణమూర్తి, కునపరాజు రామకృష్ణంరాజు, ఎ.రాంబా బు, యుఆర్‌పీఆర్ వర్మ, కేఆర్‌కే రాజు, పీవీ రామరాజు, వీవీఎస్ వర్మ పాల్గొన్నారు.

టెన్త్ పరీక్ష విద్యార్థులకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణం

భీమవరంటౌన్, మార్చి 16 : పదో తరగతి విద్యార్థులకు ఈనెల 18 నుంచి 30 వరకు జరిగే పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు ఏపీఎస్ ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పించామని డిపో మేనేజర్ పి.ఎస్.వి.ఎం.సత్యనారయణ మూర్తి తెలిపారు. పరీక్ష హాల్ టికెట్ సిబ్బందికి చూపించి ఇంటి వద్ద నుంచి పరీక్ష కేంద్రాలకు ఉచితంగా వెళ్లి రావొచ్చనానరు. పల్లెవెలుగు, అల్ట్రా పల్లెవెలుగు బస్సుల్లో ఈ సదుపాయం కల్పిస్తున్నట్టు తెలిపారు.

గ్రామాల్లో పోలీసుల కవాతు



కైకలూరు, మార్చి 11: ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో గ్రామాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసు, సాయుధ బలగాలు కవాతు నిర్వహించాయి. శనివారం కైకలూరు రూరల్ సీఐ కృష్ణకుమార్, ఎస్ఐ టి. రామకృష్ణ ఆధ్వర్యంలో కైకలూరు మండలం భుజబలపట్నం, పల్లెవాడ, ఆలపాడు గ్రామాల్లో కవాతు నిర్వహించారు. ఎన్నికల నేపథ్యంలో ప్రజలు పాటించాల్సిన విధి విధానాలను సీఐ కృష్ణకుమార్ ప్రజలకు వివరించా రు. ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకోవాలని ప్రజలకు సూచించారు.

లారీ ఢీకొని నెహ్రూ విగ్రహం ధ్వంసం



చాట్రాయి, మార్చి 16: ఆంధ్ర-తెలంగాణ సరిహద్దులో చాట్రాయి మండలం కృష్ణారావు పాలెం- తెలంగాణ రాష్ట్రం వెంకటాపురం గ్రామాల మధ్య ఉన్న దివంగత ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ విగ్రహాన్ని శుక్రవారం అర్ధరాత్రి వేగంగా వచ్చిన లారీ ఢీకొట్టటంతో ధ్వంసమైంది. రెండు రాష్ట్రాల మధ్య లాండ్ మార్క్‌గా ఉన్న విగ్రహం ధ్వంసం కావటం పట్ల ఇరు రాష్ట్రాల పరిధిలోని సరిహద్దు గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వెంకటాపురం గ్రామానికి చెందిన గొర్ల చెన్నారెడ్డి 1965లో ఈ విగ్రహాన్ని నిర్మించారు. అప్పటి నుంచి ఈ విగ్రహం రెండు రాష్ట్రాల మధ్య సరిహద్దుగా పేరొందింది. అధికారులతో మాట్లాడి మళ్ళీ విగ్రహాన్ని పునః నిర్మించటానికి చర్యలు తీసుకుంటామని వెంకటాపురం గ్రామానికి చెందిన చనుబండ కోదండరామస్వామి ఆలయ వంశపారంపర్య ధర్మకర్త పుచ్చకాయల చెన్నకేశవరెడ్డి చెప్పారు.

మేరీమాత కానుకల హుండీలో నగదు చోరీ

ఆగిరిపల్లి, మార్చి 16: చిన్నాగిరిపల్లి శివారు సర్నాలగూడెంలోని ఆర్సీఎం చర్చి సమీపంలో మేరీమాత విగ్రహం వద్ద కానుకల హుండీని శుక్రవారం అర్ధరాత్రి దుండగులు పగులకొట్టి నగదు దోచుకున్నారు. చోరీ అయిన సొమ్ము సుమారు రూ.50వేలు వరకు ఉంటుందని, ఈ హుండీ మరి కొద్దిరోజుల్లో తెరుస్తామనగా ఈవిధంగా జరిగిందని కమిటీ నిర్వాహకులు వాపోయారు.

ఎన్నికల వేళ..

» జగనన్న లే-అవుట్‌లో అధికారుల హడావుడి
» ఎన్నికల కోడ్ సమయంలో ఇదేమిటంటూ పలువురు నిలదీత
» ఉన్నతాధికారులకు సమాచారమిచ్చి వెనుదిరిగిన సర్వేయర్లు

వీరవాసరం, మార్చి16 : సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి ఎన్నికల షెడ్యూల్ కోసం ఎదురుచూస్తున్న సమయం. మరోపక్క జగనన్న లే-అవుట్ లలో స్థలాలు అప్పగించే ప్రయత్నంలో రెవెన్యూ సిబ్బంది నిమగ్నమయ్యారు. ఇటీవలే లబ్ధిదారులకు స్థలాలను రిజిస్ట్రేషన్ చేయించి అప్పగించే చర్యలు సాగాయి. అయినప్పటికీ పలు గ్రామాల్లో లబ్ధిదారులకు పూర్తిగా స్థలాలను, రిజిస్ట్రేషన్ కాగితాలను అందించలేదు. శనివారం అధికారులు ఈ ప్రయత్నంలో ఉండగా పలువురు అడ్డుకున్నారు. శనివారం ఉదయం నందమూరుగరువు లోని జగనన్న లే-అవుట్‌ను సర్వేచేసి లబ్ధిదారులకు స్థలాలను చూపించేందుకు సర్వేయర్లు లే-అవుట్‌కు వెళ్ళారు. లే-అవుట్ సరిహద్దులను రహదారులను గుర్తించే పనుల్లో ఉండగా అక్కడ స్థలాలు కేటాయించిన కొంతమంది లబ్ధిదారులు తమ స్థలాలను చూపించాలంటూ సర్వేయర్‌లను కోరారు. లబ్ధిదారులకు స్థలాలను కేటాయిస్తున్నారంటూ సమాచారం అందడంతో ఆ లేఅవుట్-లో స్థలాలు కేటాయించిన లబ్ధిదారులు హడావుడిగా అక్కడకు చేరుకున్నారు. ఈ సమాచారం తెలియడంతో జడ్పీటీసీ సభ్యుడు గుండా జయప్రకాష్‌నాయకుడు, జనసేన నాయకులు లే-అవుట్‌కు చేరుకున్నారు. లే-అవుట్‌లో పూర్తిస్థాయి సదుపాయాలు కల్పించి లబ్ధిదారులకు ప్లాట్‌లను కేటాయించి అందించాలని, హడావుడిగా చేయడం తగదని ప్రశ్నించారు. ఎన్నికల కోడ్ వస్తున్న సమయంలో ఇదేమిటంటూ నిలదీశారు. దీంతో సర్వేయర్లు అధికారులకు సమాచారం ఇచ్చి వెనుదిరిగి వెళ్లిపోయారు.


నందమూరుగరువు జగనన్న లే అవుట్‌లో స్థలాల కోసం వచ్చిన లబ్ధిదారులు


సర్వే చేస్తున్న సర్వే సిబ్బంది


మత్స్యపురిలో ఆందోళన చేస్తున్న రైతులు

సాగునీటి కోసం రాస్తారోకో

వీరవాసరం, మార్చి16: చిరుపొట్ట దశలో ఉన్న వరిచేలను కాపాడుకోవడానికి తక్షణం సాగునీరు అందించి పంటలను కాపాడాలని డిమాండ్ చేస్తూ రైతులు మత్స్యపురిలో ఆందోళనకు దిగారు. శనివారం ఏపీ కౌలురైతు సంఘం ఆధ్వర్యంలో రైతులు మత్స్యపురి మెయిన్ సెంటర్‌లో రాస్తారోకో చేశారు. వరి చేలో ఎండిన మట్టిగడ్డలతో, వరిని ప్రదర్శిస్తూ ధర్నాకు దిగారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శివారు ఆయకట్టులో ఉన్న మత్స్యపురికి సాగు నీరు అందడం లేదన్నారు. చేలు నెరలు తీసి వరి ఎండిపోయే స్థితికి వస్తున్నా అధికారులు స్పందించడం లేదన్నారు. గత 20 రోజులుగా చెరువుల్లో విడిచిన నీటిని, బోరు నీటిని పెట్టి పంటలను రక్షించుకుంటున్నామని చేలు ఎరుపురంగుకు చేరుతున్నాయని ఆందోళన చెందారు. కార్యక్రమంలో నిప్పులేటి వెంకటేశ్వరరావు, చింతా నారాయణమూర్తి, గంటా బాబూరావు, యాళ్ళ నాగభాస్కర రావు, దేవిరెడ్డి సూర్యనారాయణ, వినుకొండ రాంబాబు పాల్గొన్నారు.

లేగదూడల ప్రదర్శన.. బహుమతుల పంపిణీ


రైతులకు బహుమతులు అందిస్తున్న అధికారులు

కైకలూరు, మార్చి 16: లేగదూడల పెంపకానికి రైతులు మక్కువ చూపి పాడి పరిశ్రమను అభివృద్ధి పథంలో నడపాలని గన్నవరం పశుగణాభివృద్ధి సంస్థ ఈవో డాక్టర్ శ్రీని వాస్ అన్నారు. శనివారం వేమవరప్పాడులో పశుసంవర్ధక శాఖ, పశుగణాభివృద్ధి సంస్థ సంయుక్తంగా లేగదూడల ప్రదర్శన నిర్వహించింది. 28 లేగదూడలు పాల్గొనగా మొదటి బహుమతి ఒంగోలు జాతి దూడ పెంపకందారు బీఎస్ వెంకటేశ్వరరావు అనే రైతుకు దక్కగా రెండో బహుమతి ముర్రా జాతి దూడ పెంపకందారు గొల్లేరు సత్యనారాయణ దక్కించుకున్నారు. మూడో బహుమతి ముర్రా జాతి దూడ పెంపకందారు నున్న రాంబాబుకు అందజేశారు. ప్రతి రైతుకు ప్రోత్సాహకాలు, లేగదూడల ఎదుగుదలకు కావాల్సిన మందులను ఉచితంగా పంపిణీ చేశారు. కైకలూరు పశుసంవర్థక శాఖ ఏడీ పఠాన్ ముస్తాఫాఖాన్, పశువైద్యాధికారి అల్లూరి నాగేంద్ర వర్మ, నున్న ఫణీంద్రబాబు, హరిత, సర్పంచ్ నున్న రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

క్రైం సమాచారం

వృద్ధురాలి ఇంట్లో చోరీ

ఏలూరు క్రైం, మార్చి 16 : ఓ వృద్ధురాలు ఇంట్లో నిద్రిస్తుండగా అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు ఇంట్లోకి చొరబడి వెండి, బంగారు వస్తువులు, నగదు అపహరించుకుపోయారు. ఏలూరు అమీనాపేటకు చెందిన యలమంచిలి నాగదేవి అనే వృద్ధురాలు ఈనెల 15వ తేదీ రాత్రి తన ఇంట్లో నిద్రించింది. అర్ధరాత్రి దాటిన తరువాత గుర్తుతెలియని వ్యక్తులు ఇంట్లోకి ప్రవేశించి రెండున్నర కాసుల బంగారు ఆభరణాలు, వెండి వస్తువులు, రూ.15 వేల నగదు, ఒక సెల్‌ఫోన్ అపహరించుకుపోయారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ వెంకటేశ్వరరావు శనివారం తెలిపారు.

భార్యపై భర్త దాడి.. కేసు నమోదు

ఏలూరు క్రైం, మార్చి 16 : చెడు వ్యసనాలకు బానిసై పూటుగా మద్యం తాగి ఇంటికి వచ్చి భార్యపై దాడి చేసిన భర్తపై ఏలూరు త్రీటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఏలూరు ఎన్ఆర్‌పేటకు చెందిన మరపాక పార్వతి భర్త అప్పారావు చెడు వ్యసనాలకు బానిసై ప్రతిరోజు ఆమెను మానసికంగా, శారీరకంగా చిత్ర హింసలకు గురి చేస్తున్నాడు. ఈనెల 15న పూటుగా మద్యం తాగి వచ్చిన అతడు రుబ్బురోలుతో భార్యపై దాడి చేసి గాయపరిచాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

అక్రమ కలప పట్టివేత

బుట్టాయగూడెం, మార్చి 16 :మండలంలోని పాతరాజానగరం ప్రాంతంలో అక్రమంగా దాచి ఉంచిన 38 బండారు కలప దిమ్మెలు జంగారెడ్డిగూడెం సబ్ డీఎఫ్‌వో వెంకట సుబ్బయ్య దాడిచేసి పట్టుకున్నారు. గ్రామం సమీపంలోని పామాయిల్ తోటల్లో కలప దిమ్మెలను అక్రమంగా దాచిపెట్టారని వచ్చిన సమాచారం మేరకు సబ్ డీఎఫ్‌వో తమ సిబ్బందితో శనివారం దాడిచేసి పట్టుకుని కన్నాపురం అటవీశాఖ కార్యాలయానికి తరలించారు. గుర్తుతెలియని వ్యక్తులు కలపను అక్రమంగా దాచి ఉంచినట్టు గుర్తించిన అధికారులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

కారును ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు


మాదివాడ సెంటర్‌లో కారును ఢీకొన్న బస్సు

ఆకివీడు, మార్చి 16: ఆకివీడు కొత్త బస్టాండ్‌కు వచ్చే రోడ్‌లో కారును ఆర్టీసీ బస్సు ఢీకొట్టిన ఘటన శనివారం జరిగింది. ఏలూరు డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు భీమవరం వెళుతూ ఆకివీడు కొత్త బస్టాండ్‌కు వచ్చేందుకు మాదివాడ సెంటర్‌లోకి తిరుగుతూ ఎదురుగా వస్తున్న కారును ఢీకొంది. ఘర్షణ వాతావరణం నెలకొనడంతో పోలీసులను ఆశ్రయించారు. ప్రయాణికులను వేరే బస్సులో ఎక్కించి పంపించారు. జాతీయ రహదారి అభివృద్ధి చేయక పోవడంతో ఒక బస్సు వస్తుంటే మరో బస్సు వెళ్లేందుకు వీలులేకపోవడంతో డ్రైవర్లు, ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. హైవేపై ఏర్పాటు చేసిన దుకాణాలు తొలగించి ఊరట కల్పించాలని కోరుతున్నారు.

ఆటోను ఢీకొట్టిన కారు

» ముగ్గురు హిజ్రాలకు గాయాలు

జంగారెడ్డిగూడెం టౌన్, మార్చి 16 :అతివేగంగా ప్రయాణిస్తున్న కారు ఆటోను ఢీకొట్టడంతో పలువురికి గాయాలైన ఘటన జంగారెడ్డిగూడెం పట్టణంలో శనివారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాలివి.. పట్టణానికి చెందిన ముగ్గురు హిజ్రాలు డాంగేనగర్ వైపు ఆటోలో ప్రయాణిస్తున్నారు. జంగారెడ్డిగూడెం వైపు వస్తున్న ఓ కారు వేగంగా వచ్చి ఆటోను ఢీకొట్టడంతో వారికి గాయాలయ్యాయి. స్థానికులు క్షతగాత్రులను ఏరియా ఆసుపత్రికి తరలించారు. అదేవిధంగా ఆటోను ఢీకొట్టిన కారు ఆ పక్కనే ఉన్న ద్విచక్ర వాహనదారుడిని ఢీకొట్టడంతో అతడు స్వల్పగాయాలతో బయటపడ్డాడు.

గర్భిణులకు కేంద్ర ప్రభుత్వ సాయం అందిస్తాం

» పశ్చిమ గోదావరి జిల్లా డీఎంహెచ్‌వో మహేశ్వరరావు

భీమవరం మార్చి 16 : ప్రధానమంత్రి మాతృ వందన పథకం ద్వారా అర్హులైన గర్భిణులకు నగదు సాయం అందిస్తామని పశ్చిమ గోదావరి జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ డి. మహేశ్వరరావు శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మొదటి కాన్పుకు రూ.ఐదు వేలు నగదు, రెండో కాన్పులో ఆడపిల్ల పుట్టిన గర్భిణికి రూ. ఆరు వేలు ఆర్థిక సాయం అందిస్తామన్నారు. మొదటి కాన్పు కోసం తొలుత గర్భిణిగా నమోదు చేసుకున్నప్పుడు రూ. మూడు వేలు, జనన నమోదు. మొదటి విడత టీకా నమోదు చేసినప్పుడు రూ.2 వేలు.. మొత్తం రూ.ఐదు వేలను రెండు విడతలలో ఆధార్ అనుసంధానించిన బ్యాంకు ఖాతాలో జమచేస్తారన్నారు. రెండో కాన్పులో ఆడపిల్లకు జన్మించిన గర్భిణికి జనన నమోదు, మొదటి విడత టీకా 14 వారాల లోపు నమోదు చేసుకొన్నప్పుడు రూ. ఆరు వేల ఒకే విడతలో జమ చేస్తారన్నారు. ఈ మేరకు గర్భిణి 12 వారాలలోపు సమీప మహిళా ఆరోగ్య కార్యకర్త, ఆశా కార్యకర్తల వద్ద పేర్లు నమోదు చేయించుకుని వైద్య ఆరోగ్య శాఖ వారు అందించే అన్ని ఆరోగ్య సేవలు, ఆర్థిక సాయాన్ని పొందేలా అన్ని ప్రాథమిక, పట్టణ ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులకు, ప్రజలందరికి అవగాహన కల్పించాలని ఆదేశించామన్నారు.

'ఉమ్మడి పశ్చిమ'లో 1,935 కేసుల పరిష్కారం

ఏలూరు క్రైం, మార్చి 16 :ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌కు శనివారం సాయంత్రం వరకు 1,935 కేసులను రాజీ చేశామని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్న ప్రసాద్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. వీటిలో 1,217 క్రిమినల్ కేసులు, 365 సివిల్ కేసులు, 185 కేసులు ప్రిలిటిగేషన్, ఇతర కేసులు రాజీ చేశామని, 128 వాహన ప్రమాద కేసులను రాజీ చేసి రూ.21,03,12,341 పరిహారంగా అందించామన్నారు.

డీఆర్వోగా ఉదయ భాస్కరరావు బాధ్యతలు

భీమవరం, మార్చి 16 : జిల్లా రెవెన్యూ అధికారిగా జె.ఉదయ భాస్కరరావు శనివారం బాధ్యతలు చేపట్టారు. అనంతరం జిల్లా కలెక్టరు చాంబర్‌లో కలెక్టరు సుమిత్ కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలసి పుష్పగుచ్ఛాన్ని అందజేశారు. పలు శాఖల జిల్లా అధికారులు, జిల్లా కలెక్టరు కార్యాలయం, జిల్లా జాయింట్ కలెక్టరు కార్యాలయం, జిల్లా రెవెన్యూ అధికారి కార్యాలయ అధికారులు, సిబ్బంది కొత్త జిల్లా రెవెన్యూ అధికారి జె.ఉదయ భాస్కరరావును కలిసి పుష్పగుచ్ఛాలు అందించి అభినందనలు తెలిపారు.

ఎన్నికలకు ప్రజలందరూ సహకరించాలి : ఎస్పీ

ఇరగవరం, మార్చి16 : ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేందుకు ప్రజలందరూ సహకరించాలని పశ్చిమ గోదావరి జిల్లా ఎస్పీ డాక్టర్ అజిత వేజెండ్ల తెలిపారు. శనివారం తణుకు-పాతూరులోని అరుంధతి పేట రామాలయం వద్ద ఓటు హక్కు వినియోగంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నికల్లో ప్రజలు ఓటు హక్కును స్వేచ్ఛగా, నిర్భయంగా వినియోగించుకునేందుకు జిల్లా పోలీసు యంత్రాంగ సహకారం ఎల్లవేళలా ఉంటుందన్నారు.

ప్రశాంతంగా ఒకేషనల్ ఇంటర్ పరీక్షలు

భీమవరం ఎడ్యుకేషన్, మార్చి 16 : ఇంటర్ ఒకేషనల్ కోర్సు మెదటి సంవత్సరం పరీక్షలు పశ్చిమ గోదావరి జిల్లాలో శనివారం ప్రశాంతంగా జరిగాయి. ఇందులో జనరల్ విద్యార్థులు 102మంది హాజరయ్యారు. ఒకేషనల్‌కు సంబంధించి 1,674 మందికి గాను 1,235మంది హాజరయ్యారు. 439 మంది గైర్హాజరయ్యారని పరీక్షల నిర్వాహకుడు చంద్రశేఖర్‌బాబు తెలిపారు.

పెద్దింటమ్మ వారికి విశేష పూజలు


అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు

కైకలూరు, మార్చి 16: కొల్లేటి కోట శ్రీపెద్దింటి అమ్మవారి జాతర సందర్భంగా అమ్మవారు రోజూ విశేష పూజలందుకుంటున్నారు. శనివారం అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు పెద్దఎత్తున తరలివచ్చారు. అమ్మవారికి పంచామ వరణ, కలశార్చనపూజ, పుష్పాలంకరణ, త్రిసధినామార్చన, కుంకుమ పూజ, దూపసేవ, బాలభోగం, పంచహారతులను ఆలయ అర్చకులు పేటేటి శర్మ శాస్త్రోక్తంగా నిర్వహించారు. అమ్మవారికి పుష్పాలంకరణ, వస్త్రాలంకరణ, భక్తుల కు ప్రసాదాన్ని కైకలూరు మండలం దొడ్డిపట్ల గ్రామానికి చెందిన గొట్టుముక్కల శివరామరాజు దంపతులు అందజేయగా వారిని ఆలయ అధికారి కేవీ గోపాలరావు శేష వస్త్రాలతో సత్కరించారు. సాయంత్రం ఆలపాడు విజ్ఞాన్ పబ్లిక్ స్కూల్ చిన్నారుల జానపద నృత్యప్రదర్శన భక్తులను ఆకట్టుకుంది.

నెట్ సెంటర్లో చోరీ

నూజివీడు టౌన్, మార్చి 16: నెట్ సెంటర్ తాళాలు పగుల గొట్టి నగదు అపహరించిన ఘటన నూజివీడు మండలం మీర్జాపురంలో చోటుచేసుకుంది. బాపులపాడు మండలం కొత్త మల్లవల్లికి చెందిన శిలారపు కల్యాణ్ నూజివీడు మండలం మీర్జాపురం గ్రామంలో రాయల్ కమ్యూనికేషన్ పేరుతో ఇంటర్‌నెట్ సెంటర్, మొబైల్ షాపు నడుపుతున్నారు. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి దుకాణానికి తాళం వేసి ఇంటికి వెళ్ళి శనివారం వచ్చి చూడగా, దుండగులు షాపు తలుపులు బద్దలు కొట్టి దుకాణంలోని రూ.75 వేల నగదు, రెండు మొబైల్ ఫోన్‌లను అపహరించినట్లు గుర్తించి నూజివీడు రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధితుడు తెలిపాడు.

కోడ్ ఎఫెక్ట్

ఉమ్మడి పశ్చిమ జిల్లాలో తొలగిస్తున్న రాజకీయ ఫ్లెక్సీలు

ఉమ్మడి పశ్చిమ జిల్లాలో ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో శనివారం సాయంత్రం నుంచి రహదారులపై ఏర్పాటు చేసిన రాజకీయ నాయకుల ఫ్లెక్సీలను స్వచ్ఛందంగా తొలగించారు. ఎక్కడికక్కడ ఎన్నికల నియామవళి అమలుకు వీలుగా అధికారులు రంగంలోకి దిగారు. సాధ్యమైనంత మేర సాయంత్రం నాటికే ఎక్కడికక్కడ ఫ్లెక్సీలను తొలగించారు. నిబంధనలకు విరుద్ధంగా వున్న పోస్టర్లను తొలగిస్తూ ఆయా పార్టీ కార్యాలయాలకు తరలిస్తున్నారు.





కైకలూరులో తొలగిస్తున్న టీడీపీ ఫ్లెక్సీ, జీలుగుమిల్లి సచివాలయం వద్ద జగన్ ఫొటోను తొలగిస్తున్న సిబ్బంది, కలిదిండిలో వైసీపీ ఫ్లెక్సీని తొలగిస్తున్న దృశ్యం





సరిపల్లెలో ఫ్లెక్సీ తొలగిస్తున్న సిబ్బంది, ఆచంటలో ఫ్లెక్సీ తొలగింపు, ఆగిరిపల్లి మండలంలో ఫ్లెక్సీలు తొలగింపచేస్తున్న అధికారులు